

భోగి భాగ్యాలు పంచాలని..



సంక్రాంతి పండుగ వచ్చేసింది.. భోగభాగ్యాలు పంచాలని భోగిమంటలు వేయడం ఆనవాయితీ.. ఆ మంటల్లో కష్టాలన్నీ కాలిపోయి సుఖసంతోషాలు రావాలని.. సంక్రాంతి లక్ష్మికి స్వాగతం పలుకుతూ తొలిరోజు భోగి మంటలు వేస్తారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా వీధివీధినా భోగిమంటలకు ఏర్పాట్లు చేశారు. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం కొమరిపాలెంలో భోగిమంట ఏర్పాట్లు ఇలా..

ఆలయాలకు.. పెద్ద పండగే!

ఆలయాలకు పండగొచ్చింది.. సంక్రాంతి సందర్భంగా ఆలయాలను ప్రత్యేకంగా ముస్తాబు చేస్తున్నారు.. ప్రధాన ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. పండుగ మూడు రోజులు ఆలయాలకు పెద్ద ఎత్తున భక్తులు హాజరవుతారు. అందుకు తగిన విధంగా సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఈ చిత్రంలో చూడండి.. అన్నవరం సత్యదేవుడి ఆలయాన్ని ఎలా ముస్తాబు చేశారో.. రంగవల్లులు వేశారు.. బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. పువ్వులతో ఆలయాన్ని అందంగా అలంకరించారు.





నిబంధనలు పాటించని 32 వాహనాలపై కేసులు

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలు అతిక్రమించిన ప్రైవేటు కాంట్రాక్టు కేరియర్ బస్సులపై రవాణాశాఖ దాడులు జరిపి కేసులు నమోదు చేసింది. ఈ మేరకు ఆదివారం వివిధ ప్రాంతాల్లో జరిపిన దాడుల్లో మొత్తం 32 కేసులు నమోదు చేసినట్టు జిల్లా రవాణా అధికారి సురేష్ వెల్లడించారు. అధిక మొత్తంలో ఛార్జీలు వసూలుకు సంబంధించి 11 కేసులు, గుడ్స్ రవాణాపై 3 కేసులు, యూనిఫాం లేకుండా బస్సులు నడపడం, ప్రయాణీకులు జాబితా ప్రదర్శించకపోవడం వంటి కారణాలతో 18 కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. కాంపౌండ్ ఫీజుగా రూ.1,63,100లు వసూలు చేశామని తెలిపారు. ప్రైవేట్ బస్సు ట్రావెల్స్ యజమానులు నిబంధనలు పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవని పేర్కొన్నారు.



వివేకానంద చిత్రపటంతో విద్యార్థుల ర్యాలీ

వివేకానందకు ఘన నివాళి

రాజమహేంద్రవరం కల్చరల్ జనవరి 12(ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద జయంతిని రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివేకానంద విగ్రహానికి స్వామి పరిజ్ఞేయానంద మహరాజ్,స్వామి సేవ్యానందజీ మహరాజ్,స్వామి ప్రజ్ఞానందజీ మహరాజ్,బ్రహ్మచారి కరణ్ మహరాజ్ పుష్పాలంకరణ చేసి హారతిచ్చారు.కోరుకొండ రోడ్డులోని రామకృష్ణ మఠం నుంచి కంబాల చెరువు వరకు ర్యాలీ చేశారు.ర్యాలీలో స్వామీజీలు,వివేకానంద ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ వివేకానంద అభ్యుదయ ప్రకల్ప అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

రె..ఢీ



పోలీస్ వర్సెస్ కోడి..ఈ పోటీలో గెలుపెవరిదో మరి కొన్ని క్షణాల్లో తేలిపోనుంది.. నిర్వాహకులు తగ్గేదేలే అంటే.. పోలీసులూ అదే దారిలో ఉన్నారు.. అక్కడక్కడా బేరాలు సాగిపోతున్నాయి. అటు పోలీసులు బరి తెగిస్తే.. ఇటు నిర్వాహకులు అదే దారిలో ఉన్నారు. కోడి పందాలు, గుండాట వంటి జూదాలకు ఎగబడుతున్నారు. ప్రతి ఏడాది మాదిరిగానే పండుగ మూడు రోజులు అనుమతిస్తారన్న ధైర్యంతో ఏర్పాట్లు చేసుకుంటున్నారు. సంక్రాంతి అంటే గోదావరి జిల్లాలకు కోడిపందెం పెద్ద ఆకర్షణగా మారింది. 21 నియోజకవర్గాల్లోనూ బరులు సిద్ధం చేశారు. గతంలో వైసీపీ నేతలు బరితెగిస్తే.. ఈసారి అదే ఒరవడిని కూటమి నేతలు కొనసాగించడం గమనార్హం.

(రాజమహేంద్రవరం/అమలాపురం/దేవరపల్లి/ గోపాలపురం/ పెరవలి/ కొవ్వూరు/ ఐ.పోలవరం- ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి కోడి పందాలకు రంగం సిద్ధమైంది. కోడి పందాలు, గుండాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని పోలీస్,రెవెన్యూ యంత్రాంగం హెచ్చరిస్తున్నా నిర్వాహకులు మాత్రం తగ్గేదేలే అంటూ ఎప్పటి మాదిరిగానే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పందాలకు సర్వం సిద్ధం చేశారు. చాలాచోట్ల కోడి పందాల శిబిరాలు క్రికెట్ స్టేడియాలను తలపిస్తున్నాయి. తూర్పుగోదావరి జిల్లాలో పెద్ద బరులకు రూ.50 లక్షల వరకూ వేలంపాట వేస్తున్నారు. చిన్న గ్రామాల్లో కూడా రూ.16 లక్షల వరకూ ఉన్నాయి. జూదం విపరీతంగా పెరిగింది. ఒక్కో బరిలోనూ గుండాట నిర్వహణకు రూ.7 లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ ఇస్తున్నట్టు సమాచారం.గ్రామాల్లో వివిధ రాజకీయ పార్టీ ద్వితీయ స్థాయినేతలు,గ్రామనేతలు వీటిని ఎక్కువ నిర్వహిస్తున్నారు. జూద క్రీడల నిర్వహణకు ఆయా ప్రాంతాల్లో ఉన్న కూటమి నేతలు ముందుకు రావడం, ఎమ్మెల్యేల ద్వారా సిఫార్సులు చేయించుకుని అనుమతులు పొందడం ద్వారా లక్షల లాభార్జన చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ మూడు రోజుల పందాలు వారికి మంచి ఆదాయ వనరుగా మారాయి.గతంలో ఎన్నడూ లేనివిధంగా జూదం పెరిగిపోయింది. గతంలో అమ్మవారి తీర్థాల వంటి వాటికి చాటుమాటుగా గుండాట ఆడేవారు. ఇవాళ సంక్రాంతి అంటే అన్ని ఊర్లకు గుండాటలు వచ్చేశాయి. ఇవి మన సంప్రదాయమా? ఇది పచ్చి జూదం. అక్కడకు వచ్చిన ప్రజల జేబులను నిలువునా దోపిడీ చేస్తారు.





క్రికెట్ స్టేడియాలా..బరులా!

మురమళ్ల వద్ద పందెం బరిని మినీ స్టేడియాన్ని తలపించే రీతిలో తీర్చిదిద్దారు.ప్రత్యేక అతిథులు కొందరు సినీ నటులు బరికి హాజరయ్యే అవకాశాలు ఉన్న దృష్ట్యా పక్కనే ఉన్న పాండిచ్చేరి రాష్ట్ర పరిధిలోని యానాంలో హోటళ్ల రూమ్‌లతో పాటు గెస్ట్‌హౌస్‌లను సిద్ధం చేసినట్టు తెలిసింది. తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలంలో నాలుగైదు చోట్ల కోడి పందాలు వేసేందుకు బరులు సిద్ధం చేశారు.ఐ.పోలవరంలో సుమారు 200 మంది వీఐపీలు కూర్చుని పందాలను తిలకించేందుకు ప్రత్యేక వేదిక ఏర్పాటు చేశారు. ప్రధాన పందెం బరి చుట్టూ ఇనుప కంచెతో ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేశారు. వీఐపీలకు పసందైన విందు భోజనాలు ఏర్పాట్లు చేస్తున్నారు. ముమ్మిడివరంలో మాత్రం పోలీసులు ఓ బరి వద్దకు వెళ్లి ఏర్పాట్లను దగ్గరుండి తొలగించారు. తూర్పుగోదావరి జిల్లా రంగంపేట శివారులో ఒక బరి, గోపాలపురంలో ఒక బరిని పోలీసులు ధ్వంసం చేశారు.

ఇక్కడే మద్యం..పేకాట ఉంటాయి.నీతులు వల్లించే పోలీసులు మామూళ్లకు కక్కుర్తిపడి చట్టాన్ని ప్రక్కన పడేస్తున్నారు.ఉభయ రాష్ట్రాల తో పాటు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు స్వస్థలాలకు భారీగా చేరుకుంటున్నారు.సోమవారం నుంచి ప్రారంభమయ్యే సంక్రాంతి ఉత్సవాలను తిలకించేందుకు ఉవ్విళ్లూరుతున్న వారికి జూదక్రీడలు ప్రత్యేక ఆకర్షణగా మారనున్నాయి.

- నేటి నుంచి ఆటకు అంతా రెడీ
- బరి తెగించిన నిర్వాహకులు
- కూటమి నాయకుల గ్రీన్‌సిగ్నల్
- పోలీసులు వద్దంటున్నా ఏర్పాట్లు
- కొన్ని చోట్ల బేరసారాలు
- బరులకు వేలం నిర్వహణ
- ఒక బరి రేటు రూ.అర కోటి
- క్రికెట్ స్టేడియాల్లా తయారు
- అతిథులకు విందు భోజనాలు

పోలీసులూ బరి తెగించారు!

పట్టణాలు, పల్లెలు సహా అనేక ప్రాంతాల్లో పందెం బరులను బహిరంగంగా వేస్తున్నారు. వీటి నిరోధానికి పోలీసు,రెవెన్యూ అధికారులు హెచ్చరికలు తప్ప బరిలో మాత్రం దిగడంలేదు. పోలీసు యంత్రాంగానికి ఆయా ప్రాంతాల్లో జరిగే పందాల నిర్వాహకులు భారీగానే మామూళ్లు ముట్టచెబుతున్నారు. గతం కంటే భిన్నంగా ఈసారి మామూళ్ల రేట్లను పెంచేశారంటూ కొన్నిచోట్ల గగ్గోలు పెడుతున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతల సంయుక్త సహకారంతో పందెం బరులు సిద్ధమయ్యాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 21 నియోజకవర్గాల పరిధిలో పందెం బరులు సిద్ధమయ్యాయి. జాతీయ రహదారులు, ప్రధాన రోడ్ల చెంతనే వీటిని ఏర్పాటు చేశారు. ప్రజాప్రతినిధులు చెప్పిన బరులకే పోలీసులు గ్రీన్‌సిగ్నల్ ఇస్తున్నారు.ముందుగానే అన్ని మాటలు మాట్లాడుకున్న తర్వాతే వీటికి అనుమతులిస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. పోలీసు యంత్రాంగం ఈసారి అసలు పట్టించుకోకపోవడం వెనుక రాజకీయపరమైన ఒత్తిళ్లు ఉన్నట్టు తెలుస్తోంది. అధికారులు కనీసం ఉనికి చాటకపోవడం వెనుక భారీగా ఆర్థికపరమైన లావాదేవీలే కారణమని ప్రచారం జరుగుతోంది.

లక్షల్లో గుండాట వేలం..

కోనసీమ జిల్లాలోని మురమళ్ల, చెయ్యేరు, ఎస్.యానాంతో పాటు ఇతర ప్రాంతాల్లో జరిగే పందెం బరుల వద్ద గుండాట బోర్డులు ఏర్పాటు చేసేందుకు బహిరంగ వేలం ద్వారా పాటలు జరిగినట్టు తెలిసింది. మురమళ్ల బరి వద్ద గుండాట కోసం ప్రత్యేక సెట్టింగ్‌లు ఏర్పాటు చేశారు. చెయ్యేరులో గుండాట కోసం నిర్వాహకులు బరిని రూ.18 లక్షలకు దక్కించుకున్నట్టు తెలిసింది. తూర్పుగోదావరి జిల్లాలో అయితే రూ. 7 లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ వేలం జరిగినట్టు సమాచారం.

బరిలో బాక్సింగ్‌కు రెడీ..

డబ్ల్యుడబ్ల్యుఎఫ్ చూస్తుంటే... బాక్సింగ్ రింగ్‌లో దిగేటప్పుడు బాక్సర్లు ఒత్తిడిని అధిగమించడానికి ఎక్సర్‌సైజులు చేస్తుంటారు.. ఇక్కడ కోడిని చూడండి.. ఏం చేస్తోందో గమనించండి. సంక్రాంతి పండుగ వచ్చేయడంతో నేడో, రేపో ప్రతి కోడీ బరిలో దిగాల్సిందే.. ఈ మేరకు నిర్వాహకులు కోళ్లతో ఇలా ఎక్సర్‌సైజులు చేయిస్తున్నారు. కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వీకే రాయపురంలో ఇలా...



నిధులున్నా.. నత్తనడక!

సా..గుతున్న నిడదవోలు ఆర్‌వోబీ పనులు



నిడదవోలు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఉభయ గోదావరి జిల్లాలను కలిపే నిడదవోలు పట్టణంలో ఆర్వోబీ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా ఏడాదిలో కేవలం సుమారు 40 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. సాక్షాత్తూ మంత్రి దుర్గేష్ నియోజకవర్గకమైనా కన్నెత్తి చూసిన అధికారులు లేరు..పట్టించుకున్న పాలకులు లేరు.ఈ నేపథ్యంలో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా మారిపోయింది.మరో వైపు ప్రజలు నెలల తరబడి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొంత మంది వ్యాపారులైతే తీవ్ర నష్టాల పాలయ్యారు. ప్రధానంగా నిడదవోలు వ్యాపారం అంతా ఈ రహదారి మీదుగానే సాగుతోంది. అటువంటిది ఏడాదికాలంగా ఈ రహదారిపై రైల్వే ఓవర్ బ్రిడ్జి పనుల చేపడుతుండడంతో దాదాపు మూసివేశారు. పక్కన ఉన్న చిన్న చిన్న వీధుల గుండా వాహనదారులు ప్రయాణిస్తున్నారు. ఇది తీవ్ర ఇబ్బంది కరంగా ఉంది.మరో వైపు దుమ్ము, దూళి కారణంగా తెరిచి ఉంచిన దుకాణాలకు ప్రజలు రావడం మానేశారు. దీంతో నిడదవోలు మెయిన్‌రోడ్డు కాస్తా అయోమయంగా మారింది. వాస్తవానికి 2025 డిసెంబరు నాటికి పూర్తిచేయాలని ఆదేశాలు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో పూర్తయ్యేలా కనిపించడం లేదు.

కేంద్రం నిధులిచ్చినా..

ఉభయ గోదావరి జిల్లాల వాహనదారుల ప్రధాన సమస్య నిడదవోలు పట్టణంలోని రైల్వే గేటు.ఈ నేపథ్యంలో గోదావరి జిల్లా వాసుల ఎన్నో ఏళ్ళ కల నిడదవోలు రైల్వే ఓవర్ బ్రిడ్జి..ఈ మేరకు 2019 జనవరి 7వ తేదీన నిడదవోలు గాంధీ బొమ్మ సెంటరులో ఆర్వోబీ నిర్మాణానికి నాటి సీఎం చంద్రబాబు చర్యలు చేపట్టారు. పైలాన్ ఆవిష్కరించి 18 నెలల్లో ఆర్వోబీ నిర్మాణం పూర్తి కావాలని అధికారులకు ఆదేశించారు.రైల్వే రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో ఆర్వోబీ నిర్మాణం చేపట్టేలా ప్రణాళిక రూపొందించారు. అనంతరం ఎన్నికలు రావడం వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రివర్స్ టెండరింగ్ ప్రక్రియలో ఆర్వోబీ నిర్మాణం నిలిచిపోయింది. నాటి వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆర్వోబీ నిర్మాణంపై మాటలే తప్ప చేతలు కరువయ్యాయి.ఇదిలా ఉండగా ఆర్వోబీ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం సేతబంధన్ స్కీమ్ ద్వారా దారి చూపింది. కేంద్ర ప్రభుత్వం చొరవతో ఆర్వోబీ నిర్మాణానికి కేంద్రం దారి చూపుతుందంటూ గతేడాది ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది.అయితే ఏడాదైనా ఆ పనులు మాత్రం నత్తతో పోటీపడుతున్నాయి. ఇప్పటికే ఆర్వోబీ నిర్మాణ స్థల సేకరణకు సంబంధించి కొంత మంది యజమానులకు సొమ్ములు వారి ఖాతాలకు జమయ్యాయి.తహశీల్దార్ కార్యాలయం వైపు కొన్ని నివాసాలకు సంబంధించి యజమానులకు ఇంకా సొమ్ము చెల్లించలేదు. దీంతో ఇప్పటి వరకూ గృహాలు తొలగించ లేదు.ఆ ఫైల్ అధికారుల టేబుల్‌పై ఉందని చెబుతున్నారు.

ఈ ఏడాది పూర్తయ్యేనా?

కేంద్ర ప్రభుత్వ నిధులతో ఆర్వోబీ నిర్మాణానికి టెండర్లు పిలవడంతో కాంట్రాక్టర్ ఖరారయ్యారు.ఈ నేపథ్యంలో గతేడాది సంక్రాంతి పండుగకు ఆర్వోబీ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.ఈ సంక్రాంతి వచ్చే నాటికి ఆర్వో బీ నిర్మాణ పనులు పూర్తవుతాయని అంతా ఆశించారు. అయితే సిబ్బంది కొరత కారణంగా పనుల్లో మాత్రం వేగం కానరావడంలేదు. నిడదవోలు పట్టణ ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు.ఇప్పటికే ఆర్వోబీ నిర్మాణానికి పిల్లర్లు దాదాపుగా పూర్తయినా స్లాబ్ పనులు నిలిచిపోయాయి. వాస్తవానికి 2025 డిసెంబరు నాటికి పూర్తిచేయాలని ఆదేశాలు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో పూర్తయ్యేలా కనిపించడం లేదు.

- కేంద్రం దారిచూపినా ఇంతే
- మంత్రి ఇలాఖాలో ఇదీ పరిస్థితి
- కానరాని అధికారుల పర్యవేక్షణ
- కన్నెత్తి చూడని పాలకులు
- కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం
- 40 శాతమే పూర్తయిన ఆర్వోబీ
- వ్యాపారులు, ప్రజలకు ఇబ్బందులు
- మందకొడిగా పనులు

రూ.201 కోట్ల అంచనా..

ఆర్వోబీ నిర్మాణ వ్యయం అంచనా రూ.201 కోట్లుగా నిర్ణయించారు.భూసేక ర ణకు రూ.21 కోట్లు లెక్కించారు. సేతుబంధన్ నిధులు రూ.124 కోట్లు,కేంద్ర రైల్వేశాఖ వాటా రూ.56 కోట్లుగా తేల్చారు. నిడదవోలులో 38 మంది, సమిశ్రగూడెంలో 13 మంది నుంచి 6.14 ఎకరాలు భూసేకరణ చేశారు. ఇం దులో ప్రభుత్వ భూమి 5.11 ఎకరాలు ఉండగా.. ప్రైవేటు భూమి 1.03 ఎకరాలు. అయితే తహశీల్దార్ కార్యాలయం వద్ద కొంత మేర భూసేకరణ చేపట్టలేదు. ప్రస్తుతం సమస్యగా ఉంది.



కందిపప్పుకు.. ఎసరు!



- 35 శాతం మందికే రేషన్ కందిపప్పు
- నాణ్యత బాగాలేక తిప్పిపంపిన అధికారులు
- నేటికీ 65 శాతం మందికి అందని పప్పు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి పండగ పూట కందిపప్పు అందక జిల్లాలో రేషన్‌కార్డుదారులు తీవ్ర నిరాశకు గురయ్యారు.నవంబరు నెల నుంచి ప్రతి కార్డు హోల్డర్‌కు రూ. 67కే కేజీ కందిపప్పు ఇస్తున్న సంగతి తెలిసిందే. బయట మార్కెట్‌లో రూ.90 నుంచి రూ.180 వరకూ రకరకాల ధరల్లో విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రూ.67కే నాణ్యమైన కందిపప్పు ఇవ్వడంతో ప్రజలంతా సంతోషించారు.గత వైసీపీ ప్రభుత్వం 2023 నుంచి కందిపప్పు పంపిణీ మానేసింది. పైగా ఎవరూ కందిపప్పు తినడం లేదని ప్రచారం కూడా చేసింది.కానీ గత ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తెలుగు దేశం నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం గతేడాది నవంబరు నుంచి ప్రతీ కార్డుకు కేజీ కందిపప్పును రూ.67కే అందిస్తూ వచ్చింది. కానీ జనవరిలో ఏమైందో జిల్లా కు కేవలం 60 శాతం కందిపప్పు మాత్రమే కేటాయించారు.అందులో జిల్లాలోని 5 ఎంఎల్ పాయింట్లకు సరుకు వచ్చిన తర్వాత నాణ్యత బాగా లేకపోవడంతో అనేక టన్నుల కందిపప్పును తిరిగి వెనక్కు పం పించేశారు. రాజమహేంద్రవరంలోని ఒక ఎంఎల్ పాయింట్ నుంచి 70 టన్నుల పప్పు తిరిగి పంపించాల్సి వచ్చింది.అన్నీ జిల్లా నుంచి ఇదే విధంగా పప్పు తిరిగి వెళ్లింది.జిల్లాకు 60 శాతం కేటాయించగా అందులో నాణ్యత లేని పప్పును తిరిగి పంపడం వల్ల జిల్లాలోని ప్రజలకు కేవలం 30 నుంచి 35 శాతం కార్డుదారులకు మాత్రమే పప్పు అందడం గమనార్హం.జిల్లాలోని 5 లక్షల 75 వేల మంది రేషన్ కార్డు దారులకు ఒక్కో కార్డుకు ఒక కేజీ వంతున పంపిణీ చేయవలసి ఉంది.కానీ కేవలం 30 నుంచి 35 శాతం మందికే పప్పు అందడంతో అందరూ పండగరోజున అసంతృప్తితో ఉన్నారు.మొదట్లో రేషన్ అందిన వారికి పప్పు అందింది. చివరలో సరఫరా చేసిన వారికి పప్పు అందలేదు.

ఇంటింటికీ రేషన్‌తో ఇబ్బంది

గత వైసీపీ అమలు చేసిన ఇంటింటికీ రేషన్ విధానంతో ప్రతి నెల కొందరికి ఇబ్బందులేర్పడుతున్నాయి. ఎండీయూ వాహనాలు తక్కువగా ఉండడంతో రెండు, మూడు గ్రామాలకు ఒక వాహనం నడుపుతున్నారు. దీంతో ఎంఎల్ పాయింట్ల నుంచి కనీసం రెండు విడతలుగా సరుకు వస్తుంది.ప్రతి నెలా 20 నుంచి 25 వ తేదీ వరకూ ఒక విడతగా 25 నుంచి 30వ తేదీ లోపు రెండో విడతగా రేషన్‌ను డీలర్లకు, ఎండీయూ వాహనాలకు అందిస్తారు. వాటితో జనవరి 1 నుంచి 10వ తేదీలోపు కొంత మందికి జనవరి 15వతేదీ లోపు ఇస్తు న్నారు. ప్రతి నెలా ఎండీయూ వాహనాలు కొన్ని ప్రాంతాలకు చివరి రోజుల్లో వస్తాయి. ఏదైనా సరుకు కొరత వస్తే చివరి రోజుల్లో రేషన్ అందుకునే వారికే తక్కువ అవుతుంది. గత వైసీపీ ప్రభుత్వంలో కూడా చాలా మందికి బియ్యం అందేవి కావు.కూటమి ప్రభుత్వంలో కూడా కందిపప్పుకు సమస్య వచ్చింది.

పండుగ విషాదం

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

5

కేరళ తరహాలో....

ఆత్రేయపురంలో సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీలో భాగంగా డ్రాగన్ పడవ పోటీలు

తిలకించిన ఎమ్మెల్యేలు, రుడా చైర్మన్





ఆత్రేయపురంలో నిర్వహించిన డ్రాగన్ పడవ పోటీలు, విజేతలకు మెడల్స్ అందజేసిన ప్రజాప్రతినిధులు

ఆత్రేయపురం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం ప్రధాన కెనాల్‌లో సర్ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ సంక్రాంతి సంబరాల్లో భాగంగా కేరళ తరహాలో డ్రాగన్ పోటీలు రసవత్తరంగా సాగాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ట్రోఫీ పోటీలు స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో ఆత్రేయపురం ప్రధాన కాలువలో రెండో రోజు ఆదివారం నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. కేరళను తలపించేలా డ్రాగన్ పడవ పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. రాష్ట్రంలోని 9 జిల్లాల నుంచి 11 టీమ్‌లు 121 మంది పడవ పోటీలలో పాల్గొన్నారు. ఆత్రేయపురం నుంచి ఉచ్చిలి వరకు ప్రధాన కాలువకు ఇరువైపులా జనసందోహం పోటీలను తిలకించారు. కేరళ వాయిద్యాలు, ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా పోటీలను ఉత్సాహభరితంగా వీక్షించారు. ఎమ్మెల్యే బండారుతో పాటు రాజోలు ఎమ్మెల్యే వరప్రసాదరావు, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, రాజమహేంద్రవరం రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరిలు పడవ పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. డ్రాగన్ పడవ పోటీలతో పాటు కాయాకింగ్, కెనాయింగ్, పారాకయ్య పడవ పోటీలు రసవత్తంగా సాగాయి. దివ్యాంగులు సైతం ఈ పోటీల్లో పాల్గొనడం విశేషం. పోటీల్లో జంగారెడ్డిగూడెం జెయింట్, పల్నాడు తండర్స్, ఎన్టీఆర్ ఈగల్స్, కోటిపల్లి సీతాష్, పల్నాడు పాంథర్స్, కృష్ణ లయన్స్ సెమి ఫైనల్స్‌కు చేరుకున్నాయి. సోమవారం ఫైనల్స్ పోటీల్లో భాగంగా విజేతలను ప్రైజ్‌మనీ, జ్ఞాపికలతో సత్కరించనున్నారు. ఈ ట్రోఫీలో భాగంగా ఎమ్మెల్యే బండారుపై అభిమానంతో రాచకొండ శ్రీనివాస్ క్రియేట్ చేసిన పాట సీడీని ఎమ్మెల్యేలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, కరుటూరి నరసింహరావు, ముదునూరి వెంకట్రాజు, ముళ్ళపూడి భాస్కరరావు, ముత్యాల బాబ్జి, కంఠంశెట్టి శ్రీనివాస్, విక్టరీ అధినేత గొలుగూరి వెంకటరెడ్డి, సీఆర్సీ అధ్యక్షుడు తాడి నాగమోహనరెడ్డి, తహశీల్దారు రాజేశ్వరరావు, ఎంపీడీవో వెంకటరామన్, వివిధ శాఖాధికారులు ఉన్నారు.

పండుగ ఆనందం ఆవిరి!

- కొత్త దుస్తులు కొనేందుకు వెళ్తుండగా కబళించిన మృత్యువు
- రోడ్డు ప్రమాదంలో భార్య మృతి, భర్తకు తీవ్ర గాయాలు.. పరిస్థితి విషమం



మరణించిన మేఘన



(ఫైల్‌ఫొటో)

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగకు పిల్లలకు కొత్త దుస్తులు కొనాలని ఆనందంగా రాజమహేంద్రవరం మార్కెట్‌కు వెళ్తుండగా ప్రమాదం కబళించింది. ఈ ఘటనలో భార్య మృతిచెందగా భర్త తీవ్ర గాయాలపాలై చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. వివరాల్లోకి వెళితే.. రాజానగరం మండలం దివాన్‌చెరువు గ్రామానికి చెందిన గాడి గోపినాథ్, గాడి మేఘన (35) భార్యాభర్తలు. వారికి ఓ పాప, బాబు. గోపినాథ్ స్థానికంగా ఓ ప్రైవేట్ స్కూల్లో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. సంక్రాంతి పండుగకు పిల్లలకు దుస్తులు కొనుగోలుచేసేందుకు ఇద్దరూ ఆదివారం సాయంత్రం రాజమహేంద్రవరం బైక్‌పై వెళ్తుండగా స్థానిక ఆటోనగర్ వద్దకు వచ్చేసరికి ఐషర్ వ్యాన్, కారు మధ్యకు వీరి బైక్ రావడంతో వ్యాన్ సైడ్ భాగం బ్యాక్ హ్యాండిల్ తగలడంతో ఇద్దరూ కింద పడిపోయారు. మేఘన వెనకకు పడడంతో తలకు బలమైన అక్కడికక్కడే మృతి చెందింది. గోపినాథ్ తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 అం బులెన్స్‌లో అతడిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి బొమ్మూరు పోలీసులు చేరుకుని మేఘన మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. వ్యాన్‌ను, కారును అదుపులోకి తీసుకున్నారు.

సంక్రాంతికి స్వగ్రామం వస్తుండగా..

నిద్ర మత్తులో బైక్ నుంచి జారి పడి యువకుడి మృతి



మరణించిన సత్యనారాయణ



(ఫైల్ ఫొటో)

దేవరపల్లి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు హైదరాబాద్ నుంచి వస్తుండగా మోటార్‌సైకిల్ నుంచి జారిపడి యువకుడు మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి బిక్కవోలు మండలం ఊలపల్లి గ్రామం వెళ్తుండగా మార్గం మధ్యలో దేవరపల్లి మండలం సూర్యనారాయణపురం వద్ద ఆదివారం ఉదయం 5.50గంటలకు మోటార్‌సైకిల్ వెనుక కూర్చున్న కందిపల్లి సత్యనారాయణ (25) నిద్రమత్తులో జారిపడడంతో తలకు తీవ్రగాయమై అక్కడిక్కడే మృతిచెందాడు. సత్యనారాయణ ఉపాధి కోసం ఐదేళ్ల క్రితం హైదరాబాద్ వెళ్లి తాపీ పనిచేస్తుండగా అతడి చిన్నాన్న కందిపల్లి తలుపులయ్య వాచ్‌మేన్‌గా పనిచేస్తున్నాడు. మృతుడి బావ సీహెచ్ కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వి.సుబ్రహ్మణ్యం తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోపాలపురం సీహెచ్‌సీకి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. కాగా ఇద్దరూ హైదరాబాదులో శనివారం రాత్రి 9గంటలకు బయలుదేరినట్టు పేర్కొన్నారు.

ఊలపల్లిలో విషాధఛాయలు

బిక్కవోలు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి మండలం సూర్యనారాయణపురం జాతీ య రహదారిపై బైక్ జారి పడి కడిపల్లి సత్యనాయణ(25) మృతి చెందడంతో అతడి స్వగ్రామమైన బిక్కవోలు మండలం ఊలపల్లిలో విషాధఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన వీరబాబు, అన్నవరం దంపతులకు ఓ కుమార్తె, కుమారుడు. కుమార్తెకు పెళ్లవ్వడంతో కుమారుడు సత్యనారాయణే తల్లిదండ్రులను పోషిస్తున్నాడు. తాపీ పని చేసే సత్యనారాయణ హైదరాబాద్ వెళ్లి పనిచేస్తున్నాడు. తల్లిదండ్రులను తన వద్దే ఉంచుకుంటున్నాడు. ఇటీవల ఊలపల్లిలో ఇల్లు కూడా నిర్మించాడు. సంక్రాంతి పండుగ సందర్భంగా తల్లిదండ్రులను, ఈ ప్రాంతం నుంచి తాపీ పనికి వచ్చిన వారందరితో వ్యాన్‌లో పంపి సత్యనారాయణ తన బాబాయ్‌తో కలసి బైక్‌పై ఊలపల్లికి వస్తుండగా సూర్యనారాయణపురం వద్ద జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. దీంతో పండుగ పూట ఊలపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

జగ్గన్నతోట ప్రభల ఉత్సవానికి మరోసారి కేంద్రం గర్తింపు

కేంద్ర పర్యాటక వెబ్‌సైటులో ఏకాదశ రుద్రుల ఉత్సవం



వెబ్‌సైటులో రూపొందించిన ప్రభల ఉత్సవం

అంబాజీపేట, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ప్రపంచం నలుమూలలకు విస్తరించిన జగ్గన్నతోట ఏకాదశ రుద్రుల ప్రభల ఉత్సవాన్ని మరోసారి కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఉత్సవ్ విభాగంలోని వెబ్‌సైటులో చోటు కల్పించింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం గంగలకుర్రు అగ్రహారం గ్రామానికి చెందిన శివకేశవయూత్ సభ్యులు 450 ఏళ్లచరిత్ర కలిగిన జగ్గన్నతోట ఏకాదశ రుద్రుల ప్రాశస్త్యాన్ని చరిత్రను వివరిస్తూ కేంద్ర ప్రభుత్వ పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ లేఖరాశారు. దీంతో కేంద్ర పర్యాటక శాఖమంత్రిత్వ శాఖ ఉత్సవ నిర్వహణ, 11 ఏకాదశ రుద్రుల ప్రభల రూపాలు, గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం గ్రామాల రుద్రుల ప్రభలు పచ్చనిచేలను తొక్కుకుంటూ అప్పర్ కౌశిక దాటే దృశ్యాలు, ఉత్సవాన్ని తిలకించేందుకు జగ్గన్నతోటకు వచ్చేలక్షలాది జనం తదితర అంశాలను పరిశీలించారు. ఈ మేరకు శనివారం అర్ధరాత్రి కేంద్ర పర్యాటక శాఖ వెబ్‌సైట్‌లో చోటు కల్పించారు. కేంద్ర పండుగల జాబితాలో కేంద్ర ప్రభుత్వం చేర్చింది. ఇప్పటికే శివకేశవ యూత్ సభ్యులు ప్రధాని నరేంద్రమోదీకి లేఖ రాయడంతో ఆయన స్పందించి 2020లో ఏకాదశ రుద్రుల ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రతిలేఖను రాశారు. అలాగే 2023 జనవరి 26వ ఢిల్లీలో జరిగిన రిప్లబిక్ డే వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ తరుపున జగ్గన్నతోట ఏకాదశ రుద్రుల థీమ్‌ను ప్రత్యేకంగా శకటంగా రూపొందించి ప్రదర్శించారు. దీంతో దేశ విదేశాల్లో జగ్గన్నతోట మరింత విస్తరించింది. తాజాగా కేంద్ర పర్యాటక సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో వెబ్‌సైటులో చోటు కల్పించడంతో 11 గ్రామాల ప్రజలు, గంగలకుర్రు అగ్రహారం శివకేశవయూత్ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో జగ్గన్నతోట ప్రభల ఉత్సవాన్ని కేంద్ర, రాష్ట్రపండుగగా నిర్వహించాలని కోరుతున్నారు.

రిప్లబిక్ డే వేడుకల్లో..

ప్రదర్శన ఇవ్వనున్న ముక్కామల అయ్యప్పస్వామి గరగబృందం



ఢిల్లీలో ముక్కామల కళాకారులు

అంబాజీపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ఈనెల 26న ఢిల్లీలో జరిగే వేడుకల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం ముక్కామల పుసుపులేటి అయ్యప్పస్వామి గరగ కళాకారుల బృందం ప్రదర్శించనున్నారు. గరగ నృత్య ట్రూప్ లీడర్ అయ్యప్పస్వామి ఆధ్వర్యంలో 100 మంది కళాకారులు ఢిల్లీలోని శకటం వద్ద ప్రదర్శించున్నారు. అలాగే ఈనెల 13న ప్రధాని నరేంద్ర మోదీ ఎదుట గరగనృత్య బృందం ప్రదర్శన ఇవ్వనున్నట్టు ఆయన తెలిపారు. నృత్య ప్రదర్శనను కేంద్ర సాంస్కృతిక శాఖ, సంగీత నాటక అకాడమి ద్వారా ఆంధ్రప్రదేశ్ తరుపున ప్రదర్శన చేయనున్నట్టు తెలిపారు. గత నెల రోజుల నుంచి ఢిల్లీలో 100 మంది కళాకారులు సాధన చేస్తున్నట్టు అయ్యప్ప విలేకర్లకు తెలిపారు.

రేపటి నుంచి జాతీయ, రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), జనవరి 12 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజుపంతులు క్రీడా ప్రాంగణంలో ఈనెల 14 నుంచి 17 వరకు జాతీయ, రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్టు బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఇఫ్ ఇండియా సంయుక్తకార్యదర్శి, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి గన్నమనిచక్రవర్తి, రామచంద్రపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు డా.చెలికానిస్టాలిన్ ఆదివారం స్థానిక విలేకర్లకు తెలిపారు. 14వ ఆల్‌ఇండియా 20వ రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ టోర్నమెంట్ మెన్ అండ్ ఉమెన్ పోటీలు నిర్వహిస్తామని ప్రకటించారు. బాస్కెట్ బాల్ టోర్నమెంటు మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమానికి ఎంపీలు పిల్లి సుభాష్ చంద్రబోస్, గంటి హరీష్‌మాధుర్, శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, కుడుపూడి సూర్యనారాయణరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి హాజరవుతారని తెలిపారు. 17న విజేతలకు బహుమతి ప్రదానోత్సవ సభ జరుగుతుందని వారు పేర్కొన్నారు.

రత్నగిరిపై డీఐజీ పూజలు



డీఐజీకి వేదపండితుల ఆశీర్వచనం

అన్నవరం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం అగ్నిమాపకశాఖ డీఐజీ నిరంజనరెడ్డి కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీస్సులు అందజేశారు.

నేడు సంక్రాంతి సంబరాలు

అన్నవరం దేవస్థానంలో సోమవారం ఉదయం సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నారు. ఉదయం 5గంటలకు భోగి మంటలతో ప్రారంభిస్తారు. తెలుగుదనం ఉట్టిపడేవిధంగా వివిధ జానపద నృత్యాలు, వేషధారణలు, కోడిపుంజులు, ఎడ్ల బండి, బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు.

శానిటేషన్ స్టాక్‌యార్డులో అగ్నిప్రమాదం

రూ.15లక్షల ఆస్తి నష్టం



గొల్లప్రోలులో మంటలు ఆర్పేందుకు ప్రయత్నిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గొల్లప్రోలు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు నగర పంచాయతీ శానిటేషన్ స్టాకుయార్డులో ఆదివారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం జరిగి రూ.15లక్షల ఆస్తి నష్టం సంభవించింది. నగర పంచాయతీ శానిటేషన్ విభాగానికి చెందిన పరికరాలు, మిషన్లు, సామగ్రి భద్రపరిచినగదిలో ఆకస్మాతుగా మంటలు చెలరేగి అక్కడే చెప్పులు నిల్వ చేసిన గొడౌన్‌కు వ్యాపించాయి. ప్రమాదంలో స్టాకు యార్డులోని ఫాగింగ్ మిషన్లు, స్ప్రేయింగ్ మిషన్లు, చెట్లు, గడ్డి, కరోనా మిషన్లు, చీపురుకట్టలు, డస్ట్‌బిన్లు తదితర సామగ్రి కాలిపోయాయి. కాలిన శానిటేషన్ పరికరాలు విలువ రూ.7లక్షలు వరకూ ఉంటుందని చెబుతున్నారు. అదేవిధంగా గోడౌన్‌లో పండుగ విక్రయాలు నిమిత్తం భారీగా నిల్వ చేసిన చెప్పులు కాలిపోవడం వల్ల రూ.8లక్షలకు పైగా నష్టం జరిగిందని షాపు యజమాని గండే నాగేశ్వరరావు తెలిపారు. భారీగా మంటలు చెలరేగడంతో అదుపు చేయడానికి అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. గొల్లప్రోలు తహశీల్దారు సత్యనారాయణ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

పిఠాపురంలో ఉమ్మడి జిల్లా ఆర్చరీ పోటీలు

రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక



పోటీల్లో పాల్గొన్న ఆర్చర్లు

పిఠాపురం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలురు, బాలికల ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం జరిగాయి. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలు నుంచి ఆర్చర్లు పోటీ పడ్డారు. ఇండియన్ రౌండ్ విభాగంలో బాలబాలికలకు వేర్వేరుగా జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరచిన 12మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. బాలుర విభాగంలో జె.రాఘవేంద్ర అరుణ్, పి.నాని, బి.జయదీప్, జేఆర్.ఆదిత్య, ఎస్.లీలాప్రణవ్‌రెడ్డి, వి.రిత్విక్‌లు.. బాలికల విభాగంలో జె.ఐశ్వర్య సూర్యదీపిక, ఎస్‌కే హమీదా, పి.లక్ష్మీ, పీఏపీ చంద్రిక, కేఆర్‌పీసీ సుహాసిని, బి.తేజస్వినిదేవి విజయవాడలో ఈనెల 23నుంచి 25 వరకూ జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మణరావు తెలిపారు. పోటీలను రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ పెంకే జగదీష్, విరవాడ సర్పంచ్ బోయి నాగేశ్వరరావు, ఆర్చరీ అసోసియేషన్ సభ్యులు సోము గోవిందరాజు, కె.చిన్నబ్బాయి, జే.ప్రసాదరావు ప్రారంభించారు. విజేతలకు ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రిన్సిపాల్ కేశవరావు, కౌన్సిలర్లు రాయుడు శ్రీనుబాబు, అల్లవరపు నగేష్, అభ్యుదయ ఫౌండేషన్ ప్రతినిధి బాదం సూర్యప్రకాష్, దానం లాజర్ బాబు, వెన్నపు చక్రధరరావు, రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి నాగేంద్రకుమార్, కేతవరపు కృష్ణలు బహుమతులు అందజేశారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా జి.శివప్రసాద్, పి.సాయి, బి.నవీన్‌వంశీలు వ్యవహరించారు.

మన్యంలో చింతూరు కేంద్రంగా రెండో అసెంబ్లీ సెగ్మెంట్?

(రంపచోడవరం, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం మేరకు రాష్ట్రంలో అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య పెరగాల్సి రావడం, త్వరలో జరిగే నియోజకవర్గాల డీలిమిటేషన్ ప్రక్రియపై ఇటీవల తీవ్రస్థాయిలో చర్చ సాగుతుండడంతో రంపచోడవరం మన్యంలోని గిరిజన ఆశావాహుల్లో ఇక్కడ ఏర్పాటు కాబోయే రెండో ఎస్టీ నియోజకవర్గం పైనా చర్చ సాగుతోంది. 2014లో జరిగిన రాష్ట్ర పునర్విభజన అనంతరం రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గం 11 మండలాలతో అతి పెద్ద గిరిజన నియోజకవర్గంగా ఆవిర్భవించిన సంగతి తెలిసిందే. దీంతో ఈ నియోజకవర్గం పరిధి ఇటు ఎమ్మెల్యేలకు, అటు ప్రజానీకానికి ఇబ్బందికరంగా మారింది. ఇక్కడ భౌగోళిక పరిస్థితులు తద్వారా ఎదురైన పరిస్థితుల నేపథ్యంలో రంపచోడవరం నియోజకవర్గం కచ్చితంగా రెండుగా విభజించబడాల్సిన ఆవశ్యకతను అన్ని రాజకీయ పార్టీలు గుర్తించి, విలీన మండలాలతో కలిపి ఓ నియోజవర్గం ఏర్పాటుపై చర్చిస్తున్నారు. రంపచోడవరం నుంచి మరో నియోజకవర్గాన్ని విభజిస్తే 4 విలీన మండలాల్లో చింతూరు కేంద్రంగా ఇది ఏర్పాటవుతుందని భావిస్తున్నారు. అయితే ఈ 4 మండలాలకు అదనంగా ఇప్పటికే పోలవరం నియోజవర్గంలో విలీనమైన పూర్వపు భద్రాచలం నియోజకవర్గంలోని వేలేర్‌పాడ్, కుక్కనూరు మండలాలను కలిపి కొత్త నియోజకవర్గంగా చేస్తారా, లేక ఇపుడు రంపచోడవరం లోనే ఎగువ ప్రాంతంలో ఉన్న వై.రామవరం ఎగువ ప్రాంతాల పంచాయితీలతో పాటు మారేడుమిల్లి మండలాన్ని కూడా అందులో కలుపుతారా అన్న చర్చలు సాగుతున్నాయి. ఏదిఏమైనా నియోజవర్గాల పునర్విభజన రంపచోడవరం మన్యానికి బాగా దోహదపడుతుందని, మరికొంతమంది గిరిజన నేతలకు అవకాశం వస్తుందని పలువురు ఎదురుచూస్తున్నారు.

చోరీకి వచ్చి.. పోలీసులకు చిక్కి

ఏటీఎంలో దొంగతనానికి యత్నించిన ముగ్గురి పట్టివేత

గోకవరం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఏటీఎంలో చోరీకి పాల్పడుతూ ముగ్గురు దొంగలు పోలీసులకు పట్టుబడగా మరో దొంగ పరారీలో ఉన్నాడు. డీఎస్పీ దేవకుమార్, సీఐ సత్యకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం కామేపల్లి గ్రామానికి చెందిన ఏపూరి బెనర్జీ, నరసరావుపేటకు చెందిన రాచపూడి రాకేష్, మాచవరం మండలం పిన్నెల్లి గ్రామానికి చెందిన కొత్త గణేష్ ఈ నెల 10న కారుపై గోకవరం వచ్చి ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీకి యత్నించారు. ఈ క్రమంలో ఆ ప్రాంతంలో గస్తీ నిర్వహిస్తున్న పోలీసులను చూసి కారులో పారిపోయే ప్రయత్నంచేయ బోయారు. ఇంతలో ఎస్ఐ పవన్‌కుమార్ సిబ్బందితో కలిసి గుమ్మళ్ళదొడ్డి సమీపంలో కారును చుట్టుముట్టి పట్టుకున్నారు. ప్రధాన నిందితుడైన శ్యామ్‌సన్ పరారీలో ఉన్నాడు. అతడిపై గతంలో అనేక కేసులున్నాయి. బ్యాంక్ మేనేజర్ కందుకుర్తి సతీష్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

ఆదమరిచి నిద్రిస్తుండగా.. అర్ధరాత్రి దొంగలు పడ్డారు

30 కాసుల బంగారు ఆభరణాలు, రూ.1.50లక్షల నగదు చోరీ



క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరిస్తున్న సీఐ

అమలాపురం టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి వరకు టీవీ చూసి ఇంట్లో ఆదమరిచి నిద్రిస్తుండగా దొంగలు పడి రూ.10.50 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, నగదు అపహరించుకుపోయారు. సమాచారం తెలుసుకున్న అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్, పట్టణ సీఐ పి.వీరబాబు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పట్టణ సీఐ వీరబాబు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం శివారు కురసాలవారి వీధిలో కోలా శేషు నివాసం ఉంటున్నాడు. సంక్రాంతి పండుగ కావడంతో భార్య, పిల్లలు పుట్టింటికి వెళ్లారు. శనివారం రాత్రి శేషు ఒక గదిలో, తల్లి మరో గదిలో నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి వరకు టీవీ చూసిన శేషు ఆదమరిచి నిద్రపోయాడు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో మెలకువ రావడంతో లేచి బాత్‌రూమ్‌కు వెళుతుండగా కిటికీ తలుపులు తెరిచి ఉండడాన్ని ఇంట్లో సామగ్రి చెల్లాచెదురుగా పడి ఉండడాన్ని గుర్తించాడు. ఇంట్లో దొంగతనం జరిగిందని గ్రహించి వెంటనే పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. బీరువాకు తాళాలు వేసి ఉండకపోవడంతో పాటు లాకరు తాళాలు కూడా అక్కడే ఉండడంతో కిటికీ తలుపులు తెరుచుకుని లోనికి వచ్చిన దొంగలు బీరువాలోని 30 కాసుల బంగారు ఆభరణాలు, రూ.1.50లక్షల నగుదుతో కలిపి రూ.10.50లక్షల మేర అపహరించుకుపోయారు. సంఘటనా స్థలానికి డీఎస్పీ ప్రసాద్, సీఐ వీరబాబు సిబ్బందితో వచ్చి స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. నేర ప్రదేశాన్ని పరిశీలించారు. డీఎస్పీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. క్లూస్‌టీమ్, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి పలు ఆధారాలు సేకరించారు. అనుమానితుల నుంచి వేలిముద్రలను తీసుకున్నారు. శేషు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

పాపికొండల విహారానికి 15 బోట్లు

దేవీపట్నం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతిని పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి ప్రకృతి ప్రేమికులు పాపికొండల అందాలు తిలకించేందుకు 15 బోట్లలో 1042 మంది ఆదివారం పేరంటాలపల్లి వెళ్లారు. మండల పరిధిలో పోశమ్మగండి బోటు పాయింట్ నుంచి గోదావరి ముంపు పరీవాహక ప్రాంతాలైన పూడిపల్లి, దేవీపట్నం, అగ్రహారం, మూలపాడు, మడిపల్లి, మంటూరు, తాళ్లూరు, గొందూరు, కచ్చులూరు, కొండమొదలు తదితర గ్రామాల మీదుగా పాపికొండలు వెళ్లి సుమారు 2గంటల పాటు సందడి చేశారు. ముందుగా మాతృశ్రీ గండిపోశమ్మను దర్శించుకునివెళ్లారు.

మూడు రోజులు హౌస్‌ఫుల్

సంక్రాంతి పండుగ 3రోజులు పాపికొండలు విహారయాత్రకు వెళ్లే పర్యాటకుల టిక్కెట్లు హౌస్‌ఫుల్ అయినట్లు బోటు నిర్వాహకులు తెలిపారు. సోమ, మంగళ, బుధవారాల్లో టిక్కెట్లు ఇప్పటికే అమ్ముడయ్యాయని వివరించారు.

వెయ్యికి పైగా పర్యాటకులు

పర్యాటక బోట్ల కాల వ్యవధి పెంచండి

పాపికొండల విహారయాత్రకు వెళ్లే బోట్ల కాల వ్యవధి పెంచాలని పర్యాటకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి పాపికొండలు వెళ్లేందుకు ఆన్‌లైన్‌లో హైదరాబాద్, బెంగుళూరు నుంచి పర్యాటకులు ముందుగాను టిక్కెట్లు బుక్ చేసుకున్నారు. అయితే సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు బోటు పాయింట్‌కు చేరుకోవడానికి సమయం 40 నిమిషాలు ఆలస్యమవడంతో ప్రభుత్వ బోటు అధికారులు నిలిపివేశారు. దూర ప్రాంతాల నుంచి బయలుదేరడంతో సమయానికి రాలేకపోయామని పర్యాటకులు సబ్‌కలెక్టర్‌కు ఫోన్‌లో వివరించగా విహారయాత్రకు అనుమతి ఇచ్చారు.



బోటు పాయింట్ వద్ద పర్యాటకుల సందడి

సీఎం చంద్రబాబు ఫ్లెక్సీకి పాలాభిషేకం


చంద్రబాబు ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిల్లులు రూ.6700 కోట్లు విడుదల చేసి ఈ సంక్రాంతికి ఉద్యోగులు, కాంట్రాక్టర్లు, విద్యార్థులకు ఆనందాన్ని అందించిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం నందం గన్నిరాజు సెంటర్‌లో ఆదివారం తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవి వరప్రసాద్ ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు ఫ్లెక్సీకి పాలాభిషేకం చేసి మాట్లాడారు. బిల్లుల పెండింగ్‌లో ఉండి ఉద్యోగులు, కాంట్రాక్టర్లు గత ప్రభుత్వంలో పోరాటం చేశారని గుర్తుచేశారు. కానీ గత సీఎం పట్టించుకోలేదన్నారు. పరిశ్రమలకు రాయితీలు ఇవ్వలేదన్నారు. దీంతో రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పలేదని చెప్పారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కూడా లేకుండాపోయాయని చెప్పారు. రాష్ట్రంలో పరిస్థితులు బాగోకపోయినా కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరునెలల్లోనే చంద్రబాబు తనకున్న అనుభవంతో వ్యవస్థలను గాడిలో పెట్టి సంపద సృష్టించి సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దాస్యం ప్రసాద్, బుడ్డిగ రాధా, పిల్లి శ్యామ్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

కోడిపందాల నిర్వహణకు అనుమతులివ్వాలి

లేకుంటే నిరవధిక దీక్ష
అఖిలపక్షం కార్యకర్తలు


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న అఖిలపక్షం కార్యకర్తలు

కోరుకొండ, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంప్రదాయాలు అనుసరించి తమ గ్రామానికి కూడా కోడిపందాలు ఆడుకునేందుకు అనుమతులు ఇవ్వాలని లేని పక్షంలో తాను నిరవధిక దీక్షకు దిగుతానని బూరుగుపూడి గ్రామానికి చెందిన టీడీపీ, జనసేన, వైసీపీ నాయకులు, కార్యకర్తలు తేల్చి చెప్పారు. ఈ మేరకు వైసీపీ నాయకుడు కంటే వినయ్‌తేజ మీడియా సమావేశంలో మాట్లాడారు. తాము 15 సంవత్సరాలుగా ఏ విధమైన గొడవలు పడకుండా ఐకమత్యంగా కోడిపందాలు నిర్వహించుకుంటున్నామన్నారు. అయితే ప్రస్తుతం గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు తమ పార్టీ అధికారంలో ఉంది కాబట్టి కోడిపందాలు తామే ఆడుకుంటామని వేరే వారిని కలుపుకోబోమని చెప్పడంతో కొందరు టీడీపీ, జనసేన, వైసీపీ నాయకులు మీడియా ముందుకొచ్చారు. తాము పోలీసులను కలిశామని, అయితే గ్రామానికి ఒక బరి మాత్రమే ఉండాలని, అది కూడా అధికార పార్టీకి చెందిన వారిదే ఉంటుందని వేరే బరిని ఏర్పాటు చేయవద్దని పోలీసులు తెలిపినట్టు వినయ్‌తేజ పేర్కొన్నారు. కోడిపందాలు ఆడుకునేందుకు తమకు అనుతులివ్వాలని శాంతిభద్రతల సమస్య వస్తుందనుకుంటే మొత్తం గ్రామంలో పందాలు జరగకుండా చూడాలని డిమాండ్‌చేశారు.

నేటి నుంచి వీరుళ్లమ్మ జాతర

ఘనంగా ఏర్పాట్లు.. మెయిన్‌రోడ్డులో విద్యుద్దీపాలకంకరణ.. పోలీసు బందోబస్తు


అనపర్తి మెయిన్‌రోడ్డులో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ

అనపర్తి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): అనపర్తి గ్రామ దేవత వీరుళ్లమ్మ జాతర తీర్థ మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమై ఆరు రోజుల పాటు జరుగనున్నాయి. సోమవారం భోగి సందర్భంగా అమ్మవారి ఉత్సవాలు ప్రారంభించనున్నారు. మంగళవారం వైభవంగా అమ్మవారి జాతర జరుగనుంది. ఈ సందర్భంగా అనపర్తి మెయిన్‌రోడ్డులో వీనుల విందు చేసే విద్యుద్దీపాలకంకరణ ఏర్పాటు చేశారు. పంచాయతీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన హైదరాబాద్ వారి ఎగ్జిబిషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలువనుంది. రాత్రి బాణసంచా పోటీలు నిర్వహించనున్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు అమ్మవారి దర్శించుకునేందుకు రానుండడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. నాలుగు రోజుల పాటు అమ్మవారికి తీర్థ మహోత్సవం నిర్వహించనున్నారు.

సంస్కృతిని పరిరక్షించుకోవాలి

» మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు గోరంట్ల, ఆదిరెడ్డి, బండారు
» పలుచోట్ల సంక్రాంతి సంబరాలు
» జీఎస్ఎల్‌లో ముగ్గుల పోటీలు
» విజేతలకు భారీ బహుమతులు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న కందుల, గోరంట్ల

కడియం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి వాసు, బండారు సత్యానందరావు తెలిపారు. ఆదివారం వేమగిరి కొండాలమ్మ ఆలయం వద్ద ఆర్ఎస్ఆర్ సంస్థల అధినేత రంకిరెడ్డి సుబ్బరాజు(ఆర్ఎస్ఆర్), ఆయన తనయుడు గోపి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ముందుగా కొండాలమ్మ అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు. విజేతలకు మంత్రి, ఎమ్మెల్యేలు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన గంగిరెద్దు, గరగ నృత్యాలు, భరతనాట్యం ఆహూతులను అలరించాయి. అనంతరం మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఆదిరెడ్డి వీరరాఘవమ్మ, వెలుగుబంటి ప్రసాదు, అన్నందేవుల చంటి, మార్గాని సత్యనారాయణ, వెలుగుబంటి నాని, చెల్లుబోయిన శ్రీను, ఆకుల వీర్రాజు, రౌతు సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

రాజానగరం: రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల ఆధ్వర్యంలో హేబిటేట్ రెస్టారెంట్ ప్రాంగ ణంలో తలపెట్టిన ముగ్గుల పోటీల్లో వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు అధిక సం ఖ్యలో వచ్చి తెలుగు సంస్కృతి, సంప్రదాయా లను ప్రతిబింబేలా రంగవల్లులను తీర్చిదిద్దారు. వైద్య విద్యార్థినులు కూడా ఉత్సాహంగా పాల్గొని రంగవల్లులు వేశారు. ఈ పోటీల్లో రాజమహేంద్రవరానికి చెందిన చిక్కాల సృజన ప్రథమ, ముళ్లపూడి లలిత ద్వితీయ, జి.రత్నశ్రీ తృతీయ బహుమతులు సాధించారు. ప్రథమ బహుమతిగా రూ.80 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.40 వేలు, తృతీయ బహుమతిగా రూ.20 వేలు విలువ చేసే గోల్డ్‌కోటెడ్ వెండి హారాలను జీఎస్ఎల్ వైద్యా విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు అందజేశారు. జిల్లా వ్యాప్తంగా 98 మంది మహిళలు పాల్గొని తమ ప్రతి భను చాటుకున్నారని, ఏడుగురికి కన్సోలేషన్ బహుమతులు అందజేశామని హేబిటేట్ డైరెక్టర్ వి.హరీస్ చెప్పారు. న్యాయనిర్ణేతగా సుందరి వ్యవహరించారన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: ఏకేసీ కాలేజీలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సంక్రాంతి ఉత్సవం నిర్వహించారు. జిల్లా సంఘసంచాలక్ డాక్టర్ కర్రి రామారెడ్డి మాట్లాడుతూ సంఘం,సమాజంలో అభ్యుదయ మార్పును కోరుకుంటూ ఆర్ఎస్ఎస్ పనిచే స్తుందన్నారు.ఈ సంవత్సరం ఆర్ఎస్ఎస్ శతజయంతి సంవత్సరమని,హిందూ బంధువులందరూ,సంఘం ఆశయాల గురించి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో గోదావరి విభాగ్ సంఘచాలక్ రిమ్మలపూడి సుబ్బరాజు, ఓలేటి సత్యనారాయణ, బెజ్జవరపు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనపర్తి: అనపర్తిలోని ఎమ్ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కళాశాల ప్రాంగణమంతా రంగవల్లులతో అలంకరించారు. హరిదాసులు, గంగిరెద్దుల విన్యాసాలతో సంక్రాంతి శోభ సంతరించుకుంది. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన భోగి మంటను ఎమ్ఎస్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ మల్లిడి అనంతరెడ్డి వెలిగించగా విద్యార్థినులు మంట చుట్టూ తిరుగుతూ సాంప్రదాయ నృత్యం ప్రదర్శించారు. చిన్నారులకు భోగి పండ్లు పోశారు. కళాశాల విద్యార్థులు పంచెకట్టులో అలరించారు.


అనపర్తిలో భోగి మంట చుట్టూ నృత్యం చేస్తున్న విద్యార్థినులు

రంగంపేట: మండలంలోని సుభద్రంపేటలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో సర్పంచ్ కూటి సాయితాతారావు అధ్యక్షతన సంక్రాంతి సంబరాలు, స్వామి వివేకానంద జయంతి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎస్‌ఐ తోట కృష్ణసాయి మాట్లాడుతూ స్వామి వివేకానంద గొప్పతనాన్ని భారత దేశ ఔనత్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీ లు నిర్వహించారు. విజేతలకు బీజేపీ మండలాధ్యక్షుడు ఎం. సాయిరామ్, పేపకాయల రా మచంద్రరావు, ఎం.గుప్తా, సా ధనాల కృష్ణమర్తి, శ్రీనివాస్ బహుమతులు అందజేశారు.

సంక్రాంతి సంబరాలకు ఆర్థిక సాయం

కోరుకొండ, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా మండలంలోని శ్రీరంగపట్నంలో నిర్వహించనున్న సంబరాల నిర్వహణ కోసం విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు రూ.1 లక్ష విరాళం అందజేశారు. గ్రామంలో రైజింగ్ వారియర్స్, రామాలయం కమిటీ, గౌరీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గౌరీ చౌక్ వద్ద ఈ నెల 9నుంచి 15 వరకు ఆటల పోటీలు, సాంస్కృతిక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న శ్రీనివాసరావు రూ.లక్ష ఆర్థిక సాయాన్ని నిర్వహణ కమిటీకి అందజేశారు. కార్యక్రమంలో మామిడి అయ్యప్ప, వినకోటి బాపన్నదొర, తామర్ల రాంబాబు, వరుసల ప్రసాద్, డాక్టర్ వల్లూరి జగన్నాథశర్మ, గంటా కల్యాణ్ పాల్గొన్నారు.


జీఎస్ఎల్‌లో ప్రథమ విజేతకు బహుమతి అందజేస్తున్న గన్ని భాస్కరరావు

నేడు పీజీఆర్ఎస్ లేదు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 12(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశంలో ప్రజలు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించుకునే పెద్దపండుగ సంక్రాంతి సందర్భంగా సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను నిర్వహిచడంలేదని కలెక్టర్ ప్రశాంతి ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రజలు దీనిని గమనించుకోవాలన్నారు.

సంక్రాంతి శుభాకాంక్షలు

పర్యాటక శాఖా మంత్రి దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ కిషోర్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ప్రజలకు, అధికారులకు, పోలీసులకు, సిబ్బందికి వారి కుటుంబ సభ్యులకు భోగి, సంక్రాంతి, కనుక శుభాకాంక్షలు తెలుపుతున్నామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ప్రజలందరికీ భోగభాగ్యాలు, సిరిసంపదలు కలగాలని, సంక్రాంతిని కనువిందుగా జరుపుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. పండుగను ప్రశాంతమైన వాతావరణంలో ప్రజలంతా నిర్వహించుకోవాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల జోలికి పోవద్దని ఎస్పీ సూచించారు. పందాలు నిర్వహించి జీవహింస చేయవద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

సంక్రాంతికి పూల స్వాగతం

కడియం మండలం కడియపులంక పల్ల వెంకన్న నర్సరీలో సంక్రాంతి సందర్భంగా విరివనాలతో కూర్పు చేశారు. వివిధ రకాల మొక్కలతో ఆకృతిని తీర్చిదిద్దారు. నర్సరీ రైతులకు, మిత్రులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపేందుకు ఈ కూర్పు చేశామని నర్సరీ అధినేత పల్ల సత్తిబాబు తెలిపారు. -కడియం



పోలీసులకు బకాయిల విడుదలపై హర్షం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పోలీస్ ఉద్యోగులకు ఏడాది నుంచి పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్, శాలరీ బకాయిలు, జీపీఎఫ్, సీపీఎస్‌లను సీఎం చంద్రబాబు విడుదల చేయడం పట్ల ఆంధ్రప్రదేశ్ పోలీసు అధికారుల సంఘం తూర్పుగోదావరి అధ్యక్షుడు ఆర్ రఘురాం హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సరెండర్ లీవులు బకాయిలు మంజూరుతో పోలీసు కుటుంబాల్లో సంక్రాంతి పండుగ ముందుగా వచ్చిందన్నారు.

ఆదిరెడ్డిని చూసి తట్టుకోలేకపోతున్న మాజీ ఎంపీ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నగర అభివృద్ధిపై ఎమ్మెల్యే వాసు కమిట్‌మెంట్‌ను చూసి మాజీ ఎంపీ భరత్ రామ్ తట్టుకోలేకపోతున్నారని టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధ అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భరత్‌రామ్ నగరానికి చేసిందేమీలేదన్నారు. అనాలోచిత నిర్ణయాలతో ముంపును తెచ్చారని ధ్వజమెత్తారు. పెద్దల పట్ల మర్యాదగా వ్యవహరించే సంస్కారం భరత్‌రామ్‌కు లేదన్నారు. ఒక 420 మిల్లు కార్మికులను పరంపర పేరుతో మోసం చేస్తే అతనితో కుమ్మక్కయి డబ్బులు పంచుకున్న భరత్ రామ్ నీతి కబుర్లు చెప్పుతున్నాడని మండిపడ్డారు. సమావేశంలో టీడీపీ నాయకులు తురకల నిర్మల, బొర్రా చిన్ని, వై.దేవి ప్రసాద్, కానేటి ప్రభుదాస్, కానేటి కృపామణి, బూర కల్పన, మోతా నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భోగి మంటకు ఏర్పాట్లు పూర్తి

బిక్కవోలు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): కొమరిపాలెంలో భోగి పండుగ సందర్భంగా భారీ మంట వేయడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు మాజీ సర్పంచ్ ద్వారంపూడి వెంకటరెడ్డి తెలిపారు. ఈ మంట వేయడానికి 44 టన్నుల కలప వినియోగిస్తున్నట్లు చెప్పారు. సోమవారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దీన్ని వెలిగిస్తారని ఆయన తెలిపారు.

దేవరపల్లి: దేవరపల్లిలోని మూడు బొమ్మల సెంటర్‌లో వేయబోయే భోగి మంటల కోసం యువత గ్రామం లోని పలుచోట్ల నుంచి భారీ దుంగలను ట్రాక్టర్‌కు కట్టి చేరవేశారు. ఏటా గ్రామంలోని మూడుబొమ్మల సెంటర్‌లో భోగి మంటలు వేయడం ఆనవాయితీ. అందు కోసం దుంగలను ఏర్పాటుచేశారు. పండుగ మూడు రోజులపాటు భోగిమంట వెలుగుతూనే ఉంటుంది.

కోడిపందాలకు రంగం సిద్ధం

● పట్టించుకోని పోలీసుల హెచ్చరికలు
● భారీగా గుండాట, పేకాటకు ఏర్పాట్లు


కోడిపందాలకు సిద్ధం చేసిన బరి

కోరుకొండ, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సంప్రదాయ ముసుగులో భారీ స్థాయిలో కోడిపందాలు, గుండాట, పేకాట, ఇతర జూదం,గ్యాంబ్లిగ్ నిర్వహించేందుకు గ్రామాల్లో రంగం సిద్ధం చేశారు. ఈమేరకు బరులు సిద్ధం చేసి జనరేటర్లతో లైటింగ్‌లు,టెంట్లు పెద్ద ఎత్తున సిద్ధ చేశారు. మండలంలోని ఇంచుమించు రెండుమూడు చిన్నగ్రామాల్లో మినహా అన్ని గ్రామాల్లో అధికార ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలు సంప్రదాయ ముసుగులో నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ఆదివారం రాత్రి వరకు గ్రామాల్లోఏర్పాటు చేస్తున్న పందేల ఏర్పాట్లపై పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకున్న సమాచారం లేదు. ఎలాంటి హెచ్చరికలు పోలీసులు మీడియా ముఖంగా జారీ చేయలేదు. అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో భారీగా కోడి పందాలు, గుండాటలు, జూదం నిర్వహించేందుకు పోలీసులు లోపాయికారిగా అనుమతులు ఇస్తూ తమను మాత్రం కోడిపందాలు ఆడవద్దని చెప్పడం విడ్డూరంగా ఉందని బూరుగుపూడికి చెందిన వైసీపీ నాయకుడు కంటే వినయ్ తేట, టీడీపీ నాయకుడు వంగా శ్రీను పేర్కొనడం గమనార్హం. గతంలో కోరుకొండ మండలంలో సంక్రాంతి సందర్భంగా జరిగిన కోడిపందాలు వివాదాస్పదం కావడంతో గాడాల, గుమ్ములూరు, దోసకాయలపల్లి, కణుపూరు గ్రామాల్లో పోలీసులు గత కొన్ని సంవత్సరాలుగా కోడిపందాలు నిలిపివేశారు. అదేవిధంగా అందరికీసంక్రాంతి కోడిపందాలు నిర్వహించుకునేలా అనుమతులు ఇప్పించాలని పలు గ్రామాల నుంచి డిమాండ్ వినిపిస్తున్నాయి. దీనిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో ఎలాంటి అనుమతులు ఇస్తారో, ఎవరికి నిర్వహిస్తే గుండాట,పేకాటలో ఎంత వరకు నిలువరిస్తారో వేచి చూడాల్సి ఉంది

కోడిపందాలు, పేకాట ఆడితే చర్యలు తప్పవు

రంగంపేట: కోడిపందాలు, పేకాట నిర్వహిస్తే చర్యలు తప్పవని రంగంపేట ఎస్.ఐ. తోట కృష్ణసాయి హెచ్చరించారు. కోడిపందాలు అరికట్టేందుకు మండలంలో విస్తృతంగా సోదాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈక్రమంలో ఆదివారం మండల కేంద్రమైన రంగంపేట శివారులో కోడి పందాలు నిర్వహించడానికి బరులుసిద్ధం చేస్తున్న సమాచారం రావడంతో పోలీసు సిబ్బందితో అక్కడికి వెళ్లి ఏర్పాటుచేసిన జెండాలను, టెంట్‌లను తీసివేశారు. ఈ సందర్భంగా ఎస్.ఐ. కృష్ణసాయి మాట్లాడుతూ జూద క్రీడలకు దూరంగా ఉండి సంక్రాంతి పండుగను ప్రశాంతమైన వాతావరణంలో కుటుంబ సభ్యులతో జరుపుకోవాలని సూచించారు. అలాకాకుండా ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తెలిస్తే వెంటనే 112 నెంబరుకు లేదా స్థానిక పోలీస్ అధాకారులకు కాల్‌చేసి సమాచారం తెలపాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్.ఐ. కృష్ణసాయి అన్నారు.

సంక్రాంతి సందర్భంగా వాలీబాల్, బాడ్మింటన్ పోటీలు


బిక్కవోలులో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్‌ఐ రవిచంద్రకుమార్

బిక్కవోలు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా బిక్కవోలులో మండలస్థాయి వాలీబాల్, డబుల్స్ బాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎస్‌ఐ వి.రవిచంద్రకుమార్ ప్రారంభించారు. వాలీబాల్‌లో బిక్కవోలు, బలభద్రపురం జట్లు ప్రథమ, ద్వితీయ స్థానా లు సాధించారు. బాడ్మింటన్ డబుల్స్‌లో బిక్కవోలుకు చెందిన బండారు శివప్రసాద్, పోటోలు సోమిశెట్టి (ప్రథమ), బలభద్రపురానికి చెందిన సబ్బెళ్ల అనిల్‌కుమార్‌రెడ్డి, షేక్ ఉస్మాన్ (ద్వితీయ) స్థానాలు సాధించారు. కార్యక్రమంలో దేశం నేతలు పల్లి శ్రీనివాసరెడ్డి, చింతా శ్రీనివాసరెడ్డి, పీడీ మానుకొండ ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

నవయుగ ధన్వంతరి డాక్టర్ యల్లాప్రగడ


పీఎంపీ అసోసియేషన్ సభ్యులను సత్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మానవాళి ఆరోగ్యానికి కృషి చేసిన నవయుగ ధన్వంతరి డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు అని పీఎంపీ అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు అన్నారు. హుకుంపేట గోదావరి రుచులు కాన్ఫరెన్స్ హాల్‌లో డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు జయంతిని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రెహమాన్ ఖాన్, జిల్లా కార్యదర్శి పి.దేవానందం, కోశాధికారి పి.చిన్ని, మట్టా రమేష్, ఎస్కె సుభాన్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కవితా గోష్ఠి

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కళాగౌతమి ఆధ్వర్యంలో ఆదివారం టౌన్‌హాల్‌లో కవుల సమావేశం జరిగింది. మహాకవి దుర్గానంద్ జన్మదిన సందర్భంగా ఆయన రాసిన కవితలు వినిపించారు. దుర్గానంద్ సాహిత్యంపై పరిశోధన చేసిన బీహెచ్ రమాదేవి ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో వీవీ సుబ్రహ్మణ్యం, మల్లెమొగ్గల గోపాలరావు, సూర్యనారాయణ, ఓబులేసు, ఎస్ఆర్ పృథ్వి, కళాగౌతమి కవులు, సంక్రాంతి పండుగ గురించి తెలియజేస్తూ, కవితలు వినిపించారు. ఈ సందర్భంగా దుర్గానంద్ కుమారుడు హర్షవర్ధన్‌ను బీవీఎస్ మూర్తి సత్కరించారు. ఆకుల వీర్రాజు, పీవీబీ సంజీవరావు, కవులు పాల్గొన్నారు.

కోడి కత్తులు స్వాధీనం

గోకవరం, జనవరి12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతిని పురస్కరించుకొని జూదాలు నిర్వహిస్తే కఠినచర్యలు తప్పవని సీఐ సత్యకిషోర్, ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు. గోకవరం గ్రామ శివారున మామిడి తోటలో కోడి కత్తులు తయారు చేస్తున్న వ్యక్తులపై ఆదివారం దాడి చేసి 240 కత్తులను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. పట్టుబడినవారు గంగవరం మండలానికి చెందిన వారన్నారు.

వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి

జయంతి కార్యక్రమంలో వక్తలు


స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీకే

రాజమహేంద్రవరం సిటీ/కల్చరల్/అర్బన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): కంబాలచెరువు వివేకానంద పార్కువద్ద స్వామి వివేకానంద జయంతిని ఆదివారం నిర్వహించారు. రాజమహేంద్రవరం రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో రాజమహేంద్రి మహిళా జూనియర్ కళాశాల, ఆదిత్య కళాశాల, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో కళాశాల, పీస్ ఫర్ పీపుల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రాయల్ డార్మెటరీలో స్వామి వివేకానంద జయంతిని ఆదివారం ఘనంగా జరిపారు. రాజమహేంద్రి కళాశాల చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి వివేకానందుడి విగ్రహానికి పూలమాలలు వేశారు. యూత్ రెడ్ క్రాస్‌కు చెందిన 63 మంది వలంటీర్లు రామకృష్ణ మఠం నుంచి ఆయకార్ భవన్ వరకు ర్యాలీ చేశారు. పీస్ ఫర్ పీపుల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రాయల్ డార్మెటరీలో స్వామి వివేకానంద జయంతిని ఆదివారం ఘనంగా జరిపారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, వైఆర్‌సీ సంయుక్త ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఎస్పి గంగిరెడ్డి, వీవీఎస్ కృష్ణారావు,ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ జీవీఎస్ నాగేశ్వరరావు, డాక్టర్ బీహెచ్‌వీ రమాదేవి,ప్రిన్సిపల్ ఫణికుమార్, సంస్థ ఉపా ధ్యక్షుడు గువ్వల వెంకటేశ్వరరావు, కింతాడ రమేష్‌బాబు,తంగేటి దుర్గాప్రసాద్,గది వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకుని దేశ అభ్యున్నతికి పాటుపడాలని బీజేపీ యువజనమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బేతిరెడ్డి ఆదిత్య కోరారు. కంబాల చెరువు సెంటర్‌లోని వివేకానందుడి విగ్రహానికి బీజేపీ శ్రేణులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు,నాయకులు పాల్గొన్నారు.

రాజానగరం: స్వామి వివేకానంద 162వ జయంతి వేడుకలను రాజానగరంలోని వివేకానంద యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక హైస్కూల్ ప్రాంగణంలోని వివేకానందుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో వివేకానంద యూత్ ఆర్గనైజేషన్ సభ్యులు, పదో తరగతి (2013-2014)పూర్వ విద్యార్థులు చవ్వ చరణ్ గుప్త, ఆరట్ల హరీష్, బల్ల అవినాష్, బైరెతి సాయి చంద్ర, మత్సర్తి సత్య, ఆకాశపు ఈశ్వరి, పసలపూడి కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద ఆశయాలు యువతకు స్ఫూర్తి

కడియం: స్వామి వివేకానంద ఆశయాలు యువతకు స్ఫూర్తిదాయకమని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు అన్నారు. ఆదివారం వేమగిరి బుద్ధవిహార్‌లో మహోదయ యాజజరా ఆధ్వర్యంలో వివేకానంద జయంతి ఉత్సవాలు జరిగాయి. ఈ ఉత్సవాల్లో మార్గాని సత్యనారాయణ, చెక్కపల్లి మురళీ, ఆకుల వీర్రాజు, బీజేపి నాయకులు ఆకుల శ్రీధర్, బొర్సు సుబ్రహ్మణ్యం, కొటికలపూడి వెంకటేశ్వరావు, చిక్కాల శ్రీను, నాగుపల్లల్ల వీరబాబు, చిక్కాల ఈశ్వరరావు, గారపాటి తాతబ్బాయి, తెగిరెడ్డి నాగార్జున, కొనగల్ల శ్రీను, లోవరాజు, దాసరి ముత్యం, మల్లు పోలరాజు వివేకానంద విగ్రహానికి నివాళులర్పించారు.


కడియం: స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు


రాజానగరం హైస్కూల్లో స్వామి వివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న యూత్ సభ్యులు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
సోమవారం 13 జనవరి 2025 | 3





భోగి భాగ్యాలు పంచాలని..



సంక్రాంతి పండుగ వచ్చేసింది.. భోగభాగ్యాలు పంచాలని భోగిమంటలు వేయడం ఆనవాయితీ.. ఆ మంటల్లో కష్టాలన్నీ కాలిపోయి సుఖసంతోషాలు రావాలని.. సంక్రాంతి లక్ష్మికి స్వాగతం పలుకుతూ తొలిరోజు భోగి మంటలు వేస్తారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా వీధివీధినా భోగిమంటలకు ఏర్పాట్లు చేశారు. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం కొమరిపాలెంలో భోగిమంట ఏర్పాట్లు ఇలా..

ఆలయాలకు.. పెద్ద పండగే!

ఆలయాలకు పండగొచ్చింది.. సంక్రాంతి సందర్భంగా ఆలయాలను ప్రత్యేకంగా ముస్తాబు చేస్తున్నారు.. ప్రధాన ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. పండుగ మూడు రోజులు ఆలయాలకు పెద్ద ఎత్తున భక్తులు హాజరవుతారు. అందుకు తగిన విధంగా సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఈ చిత్రంలో చూడండి.. అన్నవరం సత్యదేవుడి ఆలయాన్ని ఎలా ముస్తాబు చేశారో.. రంగవల్లులు వేశారు.. బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. పువ్వులతో ఆలయాన్ని అందంగా అలంకరించారు.





నిబంధనలు పాటించని 32 వాహనాలపై కేసులు

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలు అతిక్రమించిన ప్రైవేటు కాంట్రాక్టు కేరియర్ బస్సులపై రవాణాశాఖ దాడులు జరిపి కేసులు నమోదు చేసింది. ఈ మేరకు ఆదివారం వివిధ ప్రాంతాల్లో జరిపిన దాడుల్లో మొత్తం 32 కేసులు నమోదు చేసినట్టు జిల్లా రవాణా అధికారి సురేష్ వెల్లడించారు. అధిక మొత్తంలో ఛార్జీలు వసూలుకు సంబంధించి 11 కేసులు, గుడ్స్ రవాణాపై 3 కేసులు, యూనిఫాం లేకుండా బస్సులు నడపడం, ప్రయాణీకులు జాబితా ప్రదర్శించకపోవడం వంటి కారణాలతో 18 కేసులు నమోదు చేసిట్టు తెలిపారు. కాంపౌండ్ ఫీజుగా రూ.1,63,100లు వసూలు చేశామని తెలిపారు. ప్రైవేట్ బస్సు ట్రావెల్స్ యజమానులు నిబంధనలు పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవని పేర్కొన్నారు.


వివేకానంద చిత్రపటంతో విద్యార్థుల ర్యాలీ

వివేకానందకు ఘన నివాళి

రాజమమహేంద్రవరం కల్చరల్ జనవరి 12(ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద జయంతిని రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివేకానంద విగ్రహానికి స్వామి పరిజ్ఞేయానంద మహరాజ్,స్వామి సేవ్యానందజీ మహరాజ్,స్వామి ప్రజ్ఞానందజీ మహరాజ్,బ్రహ్మచారి కరణ్ మహరాజ్ పుష్పాలంకరణ చేసి హారతిచ్చారు.కోరుకొండ రోడ్డులోని రామకృష్ణ మఠం నుంచి కంబాల చెరువు వరకు ర్యాలీ చేశారు.ర్యాలీలో స్వామీజీలు,వివేకానంద ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ వివేకానంద అభ్యుదయ ప్రకల్ప అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

రె..ఢీ



పోలీస్ వర్సెస్ కోడి..ఈ పోటీలో గెలుపెవరిదో మరి కొన్ని క్షణాల్లో తేలిపోనుంది.. నిర్వాహకులు తగ్గేదేలే అంటే.. పోలీసులూ అదే దారిలో ఉన్నారు.. అక్కడక్కడా బేరాలు సాగిపోతున్నాయి. అటు పోలీసులు బరి తెగిస్తే.. ఇటు నిర్వాహకులు అదే దారిలో ఉన్నారు. కోడి పందాలు, గుండాట వంటి జూదాలకు ఎగబడుతున్నారు. ప్రతి ఏడాది మాదిరిగానే పండుగ మూడు రోజులు అనుమతిస్తారన్న ధైర్యంతో ఏర్పాట్లు చేసుకుంటున్నారు. సంక్రాంతి అంటే గోదావరి జిల్లాలకు కోడిపందెం పెద్ద ఆకర్షణగా మారింది. 21 నియోజకవర్గాల్లోనూ బరులు సిద్ధం చేశారు. గతంలో వైసీపీ నేతలు బరితెగిస్తే.. ఈసారి అదే ఒరవడిని కూటమి నేతలు కొనసాగించడం గమనార్హం.

(రాజమహేంద్రవరం/అమలాపురం/ దేవరపల్లి/ గోపాలపురం/ పెరవలి/ కొవ్వూరు/ ఐ.పోలవరం- ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి కోడి పందాలకు రంగం సిద్ధమైంది. కోడి పందాలు, గుండాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని పోలీస్,రెవెన్యూ యంత్రాంగం హెచ్చరిస్తున్నా నిర్వాహకులు మాత్రం తగ్గేదేలే అంటూ ఎప్పటి మాదిరిగానే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పందాలకు సర్వం సిద్ధం చేశారు. చాలాచోట్ల కోడి పందాల శిబిరాలు క్రికెట్ స్టేడియాలను తలపిస్తున్నాయి. తూర్పుగోదావరి జిల్లాలో పెద్ద బరులకు రూ.50 లక్షల వరకూ వేలంపాట వేస్తున్నారు. చిన్న గ్రామాల్లో కూడా రూ.16 లక్షల వరకూ ఉన్నా



యి. జూదం విపరీతంగా పెరిగింది. ఒక్కో బరిలోనూ గుండాట నిర్వహణకు రూ.7 లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ ఇస్తున్నట్టు సమాచారం.గ్రామాల్లో వివిధ రాజకీయ పార్టీ ద్వితీయ స్థాయినేతలు,గ్రామనేతలు వీటిని ఎక్కువ నిర్వహిస్తున్నారు. జూద క్రీడల నిర్వహణకు ఆయా ప్రాంతాల్లో ఉన్న కూటమి నేతలు ముందుకు రావడం, ఎమ్మెల్యేల ద్వారా సిఫార్సులు చేయించుకుని అనుమతులు పొందడం ద్వారా లక్షల లాభార్జన చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ మూడు రోజుల పందాలు వారికి మంచి ఆదాయ వనరుగా మారాయి.గతంలో ఎన్నడూ లేనివిధంగా జూదం పెరిగిపోయింది. గతంలో అమ్మవారి తీర్థాల వంటి వాటికి చాటుమాటుగా గుండాట ఆడేవారు. ఇవాళ సంక్రాంతి అంటే అన్ని ఊర్లకు గుండాటలు వచ్చేశాయి. ఇవి మన సంప్రదాయమా? ఇది పచ్చి జూదం. అక్కడకు వచ్చిన ప్రజల జేబులను నిలువునా దోపిడీ చేస్తారు.



క్రికెట్ స్టేడియాలా..బరులా!

మురమళ్ల వద్ద పందెం బరిని మినీ స్టేడియాన్ని తలపించే రీతిలో తీర్చిదిద్దారు.ప్రత్యేక అతిథులు కొందరు సినీ నటులు బరికి హాజరయ్యే అవకాశాలు ఉన్న దృష్ట్యా పక్కనే ఉన్న పాండిచ్చేరి రాష్ట్ర పరిధిలోని యానాంలో హోటళ్ల రూమ్‌లతో పాటు గెస్ట్‌హౌస్‌లను సిద్ధం చేసినట్టు తెలిసింది. తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలంలో నాలుగైదు చోట్ల కోడి పందాలు వేసేందుకు బరులు సిద్ధం చేశారు.ఐ.పోలవరంలో సుమారు 200 మంది వీఐపీలు కూర్చుని పందాలను తిలకించేందుకు ప్రత్యేక వేదిక ఏర్పాటు చేశారు. ప్రధాన పందెం బరి చుట్టూ ఇనుప కంచెతో ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేశారు. వీఐపీలకు పసందైన విందు భోజనాలు ఏర్పాట్లు చేస్తున్నారు. ముమ్మిడివరంలో మాత్రం పోలీసులు ఓ బరి వద్దకు వెళ్లి ఏర్పాట్లను దగ్గరుండి తొలగించారు. తూర్పుగోదావరి జిల్లా రంగంపేట శివారులో ఒక బరి, గోపాలపురంలో ఒక బరిని పోలీసులు ధ్వంసం చేశారు.

ఇక్కడే మద్యం..పేకాట ఉంటాయి.నీతులు వల్లించే పోలీసులు మామూళ్లకు కక్కుర్తిపడి చట్టాన్ని ప్రక్కన పడేస్తున్నారు.ఉభయ రాష్ట్రాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు స్వస్థలాలకు భారీగా చేరుకుంటున్నారు.సోమవారం నుంచి ప్రారంభమయ్యే సంక్రాంతి ఉత్సవాలను తిలకించేందుకు ఉవ్విళ్లూరుతున్న వారికి జూదక్రీడలు ప్రత్యేక ఆకర్షణగా మారనున్నాయి.

- నేటి నుంచి ఆటకు అంతా రెడీ
- బరి తెగించిన నిర్వాహకులు
- కూటమి నాయకుల గ్రీన్‌సిగ్నల్
- పోలీసులు వద్దంటున్నా ఏర్పాట్లు
- కొన్ని చోట్ల బేరసారాలు
- బరులకు వేలం నిర్వహణ
- ఒక బరి రేటు రూ.అర కోటి
- క్రికెట్ స్టేడియాల్లా తయారు
- అతిథులకు విందు భోజనాలు

పోలీసులూ బరి తెగించారు!

పట్టణాలు, పల్లెలు సహా అనేక ప్రాంతాల్లో పందెం బరులను బహిరంగంగా వేస్తున్నారు. వీటి నిరోధానికి పోలీసు,రెవెన్యూ అధికారులు హెచ్చరికలు తప్ప బరిలో మాత్రం దిగడంలేదు. పోలీసు యంత్రాంగానికి ఆయా ప్రాంతాల్లో జరిగే పందాల నిర్వాహకులు భారీగానే మామూళ్లు ముట్టచెబుతున్నారు. గతం కంటే భిన్నంగా ఈసారి మామూళ్ల రేట్లను పెంచేశారంటూ కొన్నిచోట్ల గగ్గోలు పెడుతున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతల సంయుక్త సహకారంతో పందెం బరులు సిద్ధమయ్యాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 21 నియోజకవర్గాల పరిధిలో పందెం బరులు సిద్ధమయ్యాయి. జాతీయ రహదారులు, ప్రధాన రోడ్ల చెంతనే వీటిని ఏర్పాటు చేశారు. ప్రజాప్రతినిధులు చెప్పిన బరులకే పోలీసులు గ్రీన్‌సిగ్నల్ ఇస్తున్నారు.ముందుగానే అన్ని మాటలు మాట్లాడుకున్న తర్వాతే వీటికి అనుమతులిస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. పోలీసు యంత్రాంగం ఈసారి అసలు పట్టించుకోకపోవడం వెనుక రాజకీయపరమైన ఒత్తిళ్లు ఉన్నట్టు తెలుస్తోంది. అధికారులు కనీసం ఉనికి చాటకపోవడం వెనుక భారీగా ఆర్థికపరమైన లావాదేవీలే కారణమని ప్రచారం జరుగుతోంది.

లక్షల్లో గుండాట వేలం..

కోనసీమ జిల్లాలోని మురమళ్ల, చెయ్యేరు, ఎస్.యానాంతో పాటు ఇతర ప్రాంతాల్లో జరిగే పందెం బరుల వద్ద గుండాట బోర్డులు ఏర్పాటు చేసేందుకు బహిరంగ వేలం ద్వారా పాటలు జరిగినట్టు తెలిసింది. మురమళ్ల బరి వద్ద గుండాట కోసం ప్రత్యేక సెట్టింగ్‌లు ఏర్పాటు చేశారు. చెయ్యేరులో గుండాట కోసం నిర్వాహకులు బరిని రూ.18 లక్షలకు దక్కించుకున్నట్టు తెలిసింది. తూర్పుగోదావరి జిల్లాలో అయితే రూ. 7 లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ వేలం జరిగినట్టు సమాచారం.

బరిలో బాక్సింగ్‌కు రెడీ..

డబ్ల్యుడబ్ల్యుఎఫ్ చూస్తుంటే... బాక్సింగ్ రింగ్‌లో దిగేటప్పుడు బాక్సర్లు ఒత్తిడిని అధిగమించడానికి ఎక్సర్‌సైజులు చేస్తుంటారు.. ఇక్కడ కోడిని చూడండి.. ఏం చేస్తోందో గమనించండి. సంక్రాంతి పండుగ వచ్చేయడంతో నేడో, రేపో ప్రతి కోడీ బరిలో దిగాల్సిందే.. ఈ మేరకు నిర్వాహకులు కోళ్లతో ఇలా ఎక్సర్‌సైజులు చేయిస్తున్నారు. కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వీకే రాయపురంలో ఇలా....



నిధులున్నా.. నత్తనడక!

సా..గుతున్న నిడదవోలు ఆర్‌వోబీ పనులు



నిడదవోలు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఉభయ గోదావరి జిల్లాలను కలిపే నిడదవోలు పట్టణంలో ఆర్వోబీ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా ఏడాదిలో కేవలం సుమారు 40 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. సాక్షాత్తూ మంత్రి దుర్గేష్ నియోజకవర్గకమైనా కన్నెత్తి చూసిన అధికారులు లేరు..పట్టించుకున్న పాలకులు లేరు.ఈ నేపథ్యంలో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా మారిపోయింది.మరో వైపు ప్రజలు నెలల తరబడి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొంత మంది వ్యాపారులైతే తీవ్ర నష్టాల పాలయ్యారు. ప్రధానంగా నిడదవోలు వ్యాపారం అంతా ఈ రహదారి మీదుగానే సాగుతోంది. అటువంటిది ఏడాదికాలంగా ఈ రహదారిపై రైల్వే ఓవర్ బ్రిడ్జి పనుల చేపడుతుండడంతో దాదాపు మూసివేశారు. పక్కన ఉన్న చిన్న చిన్న వీధుల గుండా వాహనదారులు ప్రయాణిస్తున్నారు. ఇది తీవ్ర ఇబ్బంది కరంగా ఉంది.మరో వైపు దుమ్ము, దూళి కారణంగా తెరిచి ఉంచిన దుకాణాలకు ప్రజలు రావడం మానేశారు. దీంతో నిడదవోలు మెయిన్‌రోడ్డు కాస్తా అయోమయంగా మారింది. వాస్తవానికి 2025 డిసెంబరు నాటికి పూర్తిచేయాలని ఆదేశాలు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో పూర్తయ్యేలా కనిపించడం లేదు.

కేంద్రం నిధులిచ్చినా..

ఉభయ గోదావరి జిల్లాల వాహనదారుల ప్రధాన సమస్య నిడదవోలు పట్టణంలోని రైల్వే గేటు.ఈ నేపథ్యంలో గోదావరి జిల్లా వాసుల ఎన్నో ఏళ్ళ కల నిడదవోలు రైల్వే ఓవర్ బ్రిడ్జి..ఈ మేరకు 2019 జనవరి 7వ తేదీన నిడదవోలు గాంధీ బొమ్మ సెంటరులో ఆర్వోబీ నిర్మాణానికి నాటి సీఎం చంద్రబాబు చర్యలు చేపట్టారు. పైలాన్ ఆవిష్కరించి 18 నెలల్లో ఆర్వోబీ నిర్మాణం పూర్తి కావాలని అధికారులకు ఆదేశించారు.రైల్వే రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో ఆర్వోబీ నిర్మాణం చేపట్టేలా ప్రణాళిక రూపొందించారు. అనంతరం ఎన్నికలు రావడం వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రివర్స్ టెండరింగ్ ప్రక్రియలో ఆర్వోబీ నిర్మాణం నిలిచిపోయింది. నాటి వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆర్వోబీ నిర్మాణంపై మాటలే తప్ప చేతలు కరువయ్యాయి.ఇదిలా ఉండగా ఆర్వోబీ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం సేతబంధన్ స్కీమ్ ద్వారా దారి చూపింది. కేంద్ర ప్రభుత్వం చొరవతో ఆర్వోబీ నిర్మాణానికి కేంద్రం దారి చూపుతుందంటూ గతేడాది ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది.అయితే ఏడాదైనా ఆ పనులు మాత్రం నత్తతో పోటీపడుతున్నాయి. ఇప్పటికే ఆర్వోబీ నిర్మాణ స్థల సేకరణకు సంబంధించి కొంత మంది యజమానులకు సొమ్ములు వారి ఖాతాలకు జమయ్యాయి.తహశీల్దార్ కార్యాలయం వైపు కొన్ని నివాసాలకు సంబంధించి యజమానులకు ఇంకా సొమ్ము చెల్లించలేదు. దీంతో ఇప్పటి వరకూ గృహాలు తొలగించ లేదు.ఆ ఫైల్ అధికారుల టేబుల్‌పై ఉందని చెబుతున్నారు.



ఈ ఏడాది పూర్తయ్యేనా?

కేంద్ర ప్రభుత్వ నిధులతో ఆర్వోబీ నిర్మాణానికి టెండర్లు పిలవడంతో కాంట్రాక్టర్ ఖరారయ్యారు.ఈ నేపథ్యంలో గతేడాది సంక్రాంతి పండుగకు ఆర్వోబీ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.ఈ సంక్రాంతి వచ్చే నాటికి ఆర్వోబీ నిర్మాణ పనులు పూర్తవుతాయని అంతా ఆశించారు. అయితే సిబ్బంది కొరత కారణంగా పనుల్లో మాత్రం వేగం కానరావడంలేదు. నిడదవోలు పట్టణ ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు.ఇప్పటికే ఆర్వోబీ నిర్మాణానికి పిల్లర్లు దాదాపుగా పూర్తయినా స్లాబ్ పనులు నిలిచిపోయాయి. వాస్తవానికి 2025 డిసెంబరు నాటికి పూర్తిచేయాలని ఆదేశాలు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో పూర్తయ్యేలా కనిపించడం లేదు.

- కేంద్రం దారిచూపినా ఇంతే
- మంత్రి ఇలాఖాలో ఇదీ పరిస్థితి
- కానరాని అధికారుల పర్యవేక్షణ
- కన్నెత్తి చూడని పాలకులు
- కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం
- 40 శాతమే పూర్తయిన ఆర్వోబీ
- వ్యాపారులు, ప్రజలకు ఇబ్బందులు
- మందకొడిగా పనులు

రూ.201 కోట్ల అంచనా..

ఆర్వోబీ నిర్మాణ వ్యయం అంచనా రూ.201 కోట్లుగా నిర్ణయించారు.భూసేకరణకు రూ.21 కోట్లు లెక్కించారు. సేతుబంధన్ నిధులు రూ.124 కోట్లు,కేంద్ర రైల్వేశాఖ వాటా రూ.56 కోట్లుగా తేల్చారు. నిడదవోలులో 38 మంది, సమిశ్రగూడెంలో 13 మంది నుంచి 6.14 ఎకరాలు భూసేకరణ చేశారు. ఇందులో ప్రభుత్వ భూమి 5.11 ఎకరాలు ఉండగా.. ప్రైవేటు భూమి 1.03 ఎకరాలు. అయితే తహశీల్దార్ కార్యాలయం వద్ద కొంత మేర భూసేకరణ చేపట్టలేదు. ప్రస్తుతం సమస్యగా ఉంది.

పండుగకు.. పప్పన్నమేది!



- 35 శాతం మందికే రేషన్ కందిపప్పు
- నాణ్యత బాగాలేక తిప్పిపంపిన అధికారులు
- నేటికీ 65 శాతం మందికి అందని పప్పు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి పండగ పూట కందిపప్పు అందక జిల్లాలో రేషన్‌కార్డుదారులు తీవ్ర నిరాశకు గురయ్యారు.నవంబరు నెల నుంచి ప్రతి కార్డు హోల్డర్‌కు రూ. 67కే కేజీ కందిపప్పు ఇస్తున్న సంగతి తెలిసిందే. బయట మార్కెట్‌లో రూ.90 నుంచి రూ.180 వరకూ రకరకాల ధరల్లో విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రూ.67కే నాణ్యమైన కందిపప్పు ఇవ్వడంతో ప్రజలంతా సంతోషించారు.గత వైసీపీ ప్రభుత్వం 2023 నుంచి కందిపప్పు పంపిణీ మానేసింది. పైగా ఎవరూ కందిపప్పు తినడం లేదని ప్రచారం కూడా చేసింది.కానీ గత ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తెలుగు దేశం నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం గతేడాది నవంబరు నుంచి ప్రతీ కార్డుకు కేజీ కందిపప్పును రూ.67కే అందిస్తూ వచ్చింది. కానీ జనవరిలో ఏమైందో జిల్లా కు కేవలం 60 శాతం కందిపప్పు మాత్రమే కేటాయించారు.అందులో జిల్లాలోని 5 ఎంఎల్ పాయింట్లకు సరుకు వచ్చిన తర్వాత నాణ్యత బాగా లేకపోవడంతో అనేక టన్నుల కందిపప్పును తిరిగి వెనక్కు పంపించేశారు. రాజమహేంద్రవరంలోని ఒక ఎంఎల్ పాయింట్ నుంచి 70 టన్నుల పప్పు తిరిగి పంపించాల్సి వచ్చింది.అన్నీ జిల్లా నుంచి ఇదే విధంగా పప్పు తిరిగి వెళ్లింది.జిల్లాకు 60 శాతం కేటాయించగా అందులో నాణ్యత లేని పప్పును తిరిగి పంపడం వల్ల జిల్లాలోని ప్రజలకు కేవలం 30 నుంచి 35 శాతం కార్డుదారులకు మాత్రమే పప్పు అందడం గమనార్హం.జిల్లాలోని 5 లక్షల 75 వేల మంది రేషన్ కార్డు దారులకు ఒక్కో కార్డుకు ఒక కేజీ వంతున పంపిణీ చేయవలసి ఉంది.కానీ కేవలం 30 నుంచి 35 శాతం మందికే పప్పు అందడంతో అందరూ పండగరోజున అసంతృప్తితో ఉన్నారు.మొదట్లో రేషన్ అందిన వారికి పప్పు అందింది. చివరలో సరఫరా చేసిన వారికి పప్పు అందలేదు.

ఇంటింటికీ రేషన్‌తో ఇబ్బంది

గత వైసీపీ అమలు చేసిన ఇంటింటికీ రేషన్ విధానంతో ప్రతి నెల కొందరికి ఇబ్బందులేర్పడుతున్నాయి. ఎండీయూ వాహనాలు తక్కువగా ఉండడంతో రెండు, మూడు గ్రామాలకు ఒక వాహనం నడుపుతున్నారు. దీంతో ఎంఎల్ పాయింట్ల నుంచి కనీసం రెండు విడతలుగా సరుకు వస్తుంది.ప్రతి నెలా 20 నుంచి 25 వ తేదీ వరకూ ఒక విడతగా 25 నుంచి 30వ తేదీ లోపు రెండో విడతగా రేషన్‌ను డీలర్లకు, ఎండీయూ వాహనాలకు అందిస్తారు. వాటితో జనవరి 1 నుంచి 10వ తేదీలోపు కొంత మందికి జనవరి 15వతేదీ లోపు ఇస్తు న్నారు. ప్రతి నెలా ఎండీయూ వాహనాలు కొన్ని ప్రాంతాలకు చివరి రోజుల్లో వస్తాయి. ఏదైనా సరుకు కొరత వస్తే చివరి రోజుల్లో రేషన్ అందుకునే వారికే తక్కువ అవుతుంది. గత వైసీపీ ప్రభుత్వంలో కూడా చాలా మందికి బియ్యం అందేవి కావు.కూటమి ప్రభుత్వంలో కూడా కందిపప్పుకు సమస్య వచ్చింది.

పండుగకి వస్తూ.. నిద్రమత్తులో బైక్ నుంచి జారిపడి మృతి 6

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

సంక్రాంతి సంబరాలు

పలుచోట్ల ఘనంగా ముందస్తు వేడుకలు.. క్రీడాపోటీలు.. ఆలయాల్లో పూజలు



చాగల్లు: మల్లవరంలో క్రికెట్ లీగ్ విజేతకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

దేవరపల్లి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి ముందస్తు సంబరాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. త్యాజంపూడి జడ్పీ హైస్కూల్లో డీవైఎఫ్ఐ, సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో సర్పంచ్ కుసులూరి వెంకటసతీష్ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాల బారిన పడకుండా క్రీడలు దోహదపడతాయన్నారు. జూదాలకు వ్యతిరేకంగా ఈవైఎఫ్ఐ చేస్తున్న కృషి అభినందనీయ మన్నారు. కార్యక్రమంలో రాం బాబు, తాతారావు, పల్లి వెంకటరత్నారెడ్డి, అక్కిన సుబ్బా రావు, సీఐటీయూ నాయకుడు ఎస్.భగత్ పాల్గొ న్నారు. ఇదిలా ఉండగా సంక్రాంతి సందర్భంగా దేవరపల్లికి చెందిన టీ.ముకుంద సంస్థ ఆధ్వ ర్యంలో అచ్చెయ్యపాలెం, బుచ్చయ్యపాలెం గ్రా మాల్లో 120మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేసినట్టు సంస్థ అధ్యక్షుడు తంగెళ్ల సుబ్రహ్మ ణ్యం తెలిపారు. ఏటా సంక్రాంతికి ముకుంద సం స్థ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు కె.పం డు, పీతల కుటుంబరావు, తదితరులు పాల్గొన్నారు.

తెలికిచర్లలో కిక్రెట్ టోర్నమెంట్

నల్లజర్ల, జనవరి 12(ఆంధ్రజ్యోతి): తెలికిచర్ల గ్రామంలో కూటమి ఆధ్వర్యంలో మెగా కిక్రెట్ టోర్నమెంట్ జరిగింది. నాలుగు జట్లు పోటీ పడగా తాండవ జట్టు విజేతగా నిలవగా సత్తి పండు జట్టు రన్నర్‌గా నిలిచింది. విజేతలకు ట్రోఫీతోపాటు నగదు బహుమతులు అందించారు. టోర్నమెంట్ నిర్వహనకు సర్పంచ్ బండి చిట్టి, కూటమి నాయకులు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో రుద్ర శ్రీను, సుంకర రామకృష్ణ, చీమకుర్తి రాము, వీరమల్ల అనిల్ కుమార్, వంకిన రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

కొవ్వూరులో త్రోబాల్ క్రికెట్ పోటీలు

కొవ్వూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సన్‌రైజర్స్ యూత్ ఆధ్వర్యంలో త్రోబాల్ క్రికెట్ పోటీలు ప్రారంభించారు. స్థానిక ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో చేపట్టిన ఈ టోర్నమెంటును ముఖ్యఅతిథులు టీడీపీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యుడు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, దుద్దుపూడి రాజారమేష్ ప్రారంభించారు. ఈ నెల 15 వరకూ ఈ టోర్నమెంటు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

శ్రీకోదండ రామాలయంలో పూజలు

గోపాలపురం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా మండలంలోని వేళ్లచింతల గూడెంలోని శ్రీకోదండ రామాలయంలో గోదారంగనాథుల కల్యాణోత్సవం నేపథ్యంలో ఆదివారం పలు రకాల పూజలు చేశారు. ఈ సంద ర్భంగా సీతారాముల ఆలయంలో గోదారంగనా థుల అభిషేకం, తులసీదళార్చన, సుదర్శన హో మం జరిపారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సుదర్శన హోమంలో దుగ్గిరాల రజని శ్రీనివాసరావు దంపతులు శారద కొండ్రాయుడు, ఈశ్వరి, కొండ్రావు, కావ్య, చంద్రిక, చైతన్య దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు.

పంచాయతీ సిబ్బందికి కిట్లు

తాళ్లపూడి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా ఆదివారం గజ్జరం గ్రామంలో పారిశుధ్య కార్మికులకు సర్పంచ్ గండి రాంబాబు శానిటేషన్ కిట్లు, నూతన వస్త్రాలు అందించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ దండమూడి శేషు, కార్యదర్శి వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

కబడ్డీ, క్రికెట్ పోటీలు

చాగల్లు, జనవరి 12, (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లవరంలో కబడ్డీ పోటీలు జరిగాయి. సుమారు 20కి పైగా జట్లు పాల్గొన్నాయి. గౌరిపల్లి, మార్కొండపాడు జట్లు మధ్య జరిగిన పోటీ ఆకట్టుకుంది. గ్రామ యువకులు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. చాగల్లులో ఎన్టీఆర్ లీగ్ క్రికెట్ పోటీలు పోటాపోటీగా సాగుతున్నాయి. ఆదివారం చాగల్లు, కొవ్వూరు జట్టుతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో చాగల్లు జట్టు విజయం సాధించింది.

అపూర్వ కలయిక





గోపాలపురం/నల్లజర్ల,జనవరి 12(ఆంధ్రజ్యోతి): పండుగకు వచ్చారు.. పాత స్నేహితులను కలిశారు.. ఆనందంగా గడిపారు. గోపాలపురం జిల్లా పరిషత్ హైస్కూల్లో 1997-98 బ్యాచ్ విద్యా ర్థులు, నల్లజర్ల మండలం తూర్పుచోడవరం జడ్పీ హైస్కూల్లో 1990-91 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు.విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు.

పల్లంట్లలో కుంతీదేవి ఉత్సవాలు

దేవరపల్లి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లంట్ల గ్రామంలో కుంతీదేవి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు అమ్మవారిని, నందిశ్వరున్ని శిరస్సుపై పెట్టుకుని మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగించారు. అనంతరం కుంతీదేవి విగ్రహాన్ని ఊరచెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భోగికి ఏర్పాట్లు



దేవరపల్లిలో భోగి మంట కోసం ట్రాక్టర్‌తో తరలిస్తున్న భారీ దుంగ

దేవరపల్లి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలోని మూడుబొమ్మల సెంటర్‌లో వేయబోయే భోగి మంటల కోసం యువత గ్రామంలోని పలుచోట్ల నుంచి భారీ దుంగలను ట్రాక్టర్‌కు కట్టి చేరవేశారు. ఏటా గ్రామంలోని మూడుబొమ్మల సెంటర్‌లో భోగిమంటలు వేయడం ఆనవాయితీ. అందుకోసం దుంగలను ఏర్పాటు చేశారు. పండుగ మూడు రోజుల పాటు భోగిమంట వెలుగుతూనే ఉంటుంది.

ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రదానం కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కోడూరి రమామణి ప్రసాద్, టీడీపీ నాయకులు కరుటూరి సతీష్, దొంగ రామకృష్ణ, పోలవరం డీఈ నత్తా పరమ రాజేశ్వరరావు, కోడూరి శ్రీనివాసరావు, దొడ్డ వెంకటరావు పాల్గొన్నారు.

కూటమి రైతుల పక్షపాతి

చాగల్లు, జనవరి 12, (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తుందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలో పర్యటించి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గౌరిపల్లి, మల్లవరం గ్రామాల్లో ఎన్ఆర్‌జీఎస్ నిధులతో నిర్మాణం చేసిన గోకులం షెడ్డులను ఆయన ప్రారంభించారు. అనంతరం ఊనగట్ల, చిక్కాల గ్రామాల్లో లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం సకాలంలో ధాన్యం సొమ్ములు చెల్లించిందని, వ్యవసాయం పండుగ అనే విధంగా రైతులు ఆనందంగా ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం పనిచేస్తున్నట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో ఆర్ శ్రీదేవి, కూటమి నాయకులు ఆళ్ళ హరిబాబు, నాదెళ్ళ శ్రీరామ్ చౌదరి, వై అబ్బులు చౌదరి, చిటికెన పెంటారావు, బొల్లిన శివ నాగేంద్ర, కోగూరి కాశి గంగాధరరావు, కోడూరి వెంకట రాయుడు, ఆలపాటి వీరభద్రం లకంసాని శ్రీనివాసరావు, ఉప్పులూరి చిరంజీవి పాల్గొన్నారు.

పండక్కి వస్తూ..



ఘటనా స్థలంలో సత్యనారాయణ మృతదేహం (ఇన్‌సెట్లో) ఫైల్‌ఫొటో

» మోటార్‌సైకిల్ నుంచి జారి పడి యువకుడి మృతి
» నిద్రమత్తులో ప్రమాదం
» పండుగ పూట విషాదం

దేవరపల్లి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి హైదరాబాదు నుంచి వస్తుండగా మోటార్‌సైకిల్ నుంచి జారిపడి ఒకరు మృతి చెందారు.పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. హైదరాబాదు నుంచి బిక్కవోలు మండలం ఊల్లపల్లి గ్రామం వెళ్తుండగా మార్గం మధ్యలో దేవరపల్లి మండలం సూర్యనారాయణపురం వద్ద ఆదివారం ఉదయం 5.50గంటలకు మోటార్‌సైకిల్ వెనుక కూర్చున్న కందిపల్లి సత్యనారాయణ(25) నిద్రమత్తులో జారిపడడంతో తలకు తీవ్రగాయమై మృతిచెందాడు. సత్యనారాయణ ఉపాధి కోసం ఐదేళ్ల కిందట హైదరాబాదు వెళ్లి తాపీ పనిచేస్తుండగా, అతడి చిన్నాన్న కందిపల్లి తలుపులయ్య వాచ్‌మ్యాన్‌గా పని చేస్తున్నాడు. మృతుడి బావ సీహెచ్ కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వి.సుబ్రహ్మణ్యం తెలిపారు.మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోపాలపురం సీహెచ్‌సీకి తరలిం చినట్టు ఎస్ఐ తెలిపారు. కాగా ఇద్దరూ హైదరాబాదులో శనివారం రాత్రి 9గంటలకు బయలుదేరినట్టు పేర్కొన్నారు. బిక్కవోలు మండలం ఊలపల్లిలో విషాదఛాయలు నెలకొన్నాయి. తాపీపని చేసే సత్యనారాయణ హైదరాబాద్ వెళ్లి పనిచేస్తున్నాడు. తల్లిదండ్రులను తన వద్దే ఉంచుకుంటున్నాడు. ఇటీవల ఊలపల్లిలో ఇల్లు కూడా నిర్మించాడు. పండుగ సందర్భంగా తల్లిదండ్రులను, ఈ ప్రాంతం నుంచి తాపీ పనికి వచ్చిన వారందరితో వ్యాన్‌లో పంపి సత్యనారాయణ తన బాబాయ్‌తో కలసి బైక్‌పై ఊలపల్లికి వస్తుండగా సూర్యనారాయణపురం వద్ద జరిగిన ప్రమాదంలో మృతిచెందాడు.

పంటకాలువలో పడి మృతి

కొవ్వూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు పంటకాలువలో పడి వ్యక్తి మృతిచెందినట్టు కొవ్వూరురూరల్ ఎస్ఐ కె. శ్రీహరిరావు తెలిపారు. కొవ్వూరు మండలం వాడపల్లి బంగారమ్మపేటకు చెందిన మంగా సూరిబాబు (58) ఈ నెల 5వ తేదీన ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆదివారం కొవ్వూరు నుంచి విజ్జేశ్వరం రోడ్‌లో మద్దూరు మలుపు వద్ద పంటకాలువలో గుర్తు తెలియని మృతదేహం ఉందని వచ్చిన సమాచారం మేరకు రూరల్ ఎస్ఐ కె. శ్రీహరిరావు సంఘటనా స్థలానికి చేరుకుని సూరిబాబుగా గుర్తించారు.మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

స్వామి వివేకానంద యువతకు స్ఫూర్తి



ఉండ్రాజవరంలో స్వామి వివేకానందకు నివాళులు

జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద జయంతి వేడుకలను కొవ్వూరులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జి టోల్‌గేట్ సెంటర్‌లో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ) కె.శివప్రసాద్ వివేకానంద విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వివేకానంద ఫౌండేషన్ చైర్మన్ అనపర్తి గోపాలకృష్ణ, యువజన సమితి అధ్యక్షుడు ఎస్.రాఘవేంద్రరావు, భరద్వాజ శర్మ, చరణ్, జి.శ్రీహరి, వైకే శ్రీనివాస్, గాంధీ, ఎస్.హరనాథ్, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: ఉండ్రాజవరం శాఖాగ్రంథాలయములో జరిగిన కార్యక్రమంలో స్వామివివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వివేకానందుని జయంతిని జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకోవడం యువతకు స్ఫూర్తిదాయకమని, ఆయన బోధనలను యువత ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ సభ్యుడు ఆకెళ్ల శ్రీనివాసు, గ్రంథపాలకుడు జి.కృష్ణారావు, బి.సాయిశేఖర్, కేవీ రమణ, కేవీకే రావు, కేవీవీ సత్యనారాయణ, ఎస్.సాయిగిరిధర్, సీహెచ్ శ్రీరామ చంద్రమూర్తి పాల్గొన్నారు.

చాగల్లు: మండలంలోని ఊనగట్లలో స్వామి వివేకానందస్వామి విగ్రహానికి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానందుడు బోధనలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని, వ్యక్తిత్వ వికాసం, జీవితంలో రాణించడానికి ఆయన జీవితం ఆదర్శమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆళ్ల హరిబాబు, నాదెళ్ల శ్రీరామ్ చౌదరి, బొల్లిన శివనాగేంద్ర పాల్గొన్నారు.

